విశాలాంధ్ర

తిరుపతి జిల్లా

చిత్తూరు జిల్లా

శుక్రవారం 26, జులై 2024 | 8 పేజీలు

కండలేరు నీటి సరఫరాను ప్రారంభించిన కమిషనర్

విశాలాంధ్ర - తిరుపతి : తిరుపతి తిరుమల నగర ప్రజలకు అవసరమైన తాగునీరు కోసం కండలేరు నుండి కె.పి కెనాల్ ద్వారా గురువారం సాయంత్రం కండలేరు నుండి నీటి సరఫరాను తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ నారపురెడ్డి మౌర్య ఐఏఎస్ పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మౌర్య మాట్లాడుతూ కండలేరు నుండి నీటి సరఫరా గత కొంతకాలంగా జరగడం లేదని, ఇరిగేషన్ అధికారులకు మునిసిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ అనుమతితో 85 లక్షలను ఇటివలే కేటాయించడం జరిగిందని, వారు పూడికతీత పనులు చేపట్టి నీటి సరఫరా సజావుగా సాగేందుకు కెపి కెనాల్ నుండి నీటి సరఫరాను సిద్ధం చేయడంతో నీటి సరఫరాను ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ మంచి నీటిని వృదా చేయవద్దని, అదేవిధంగా కెనాల్ ప్రవహించే ప్రదేశాల నుండి రైతులు అక్రమంగా నీటి సరఫరాను మళ్లించ వద్దని కమిషనర్ నారపురెడ్డి మౌర్య విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమంలో తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ సూపరింటెండెంట్ ఇంజనీర్ తిరుమాలిక మోహన్, మునిసిపల్ ఇంజనీర్ చంద్రశేఖర్, డిఈ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రచందనం స్మగ్లర్ల నిరోధానికి కఠిన చర్యలు

: టాస్క్ ఫోర్సు ఇన్చార్జి ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు

విశాలాంధ్ర - తిరుపతి : శేషాచలం అడవుల్లోకి ప్రవేశిస్తున్న ఎర్రచందనం స్మగ్లర్లను నిరోధించడానికి కఠిన చర్యలు తీసుకుంటామని టాస్క్ ఫోర్స్ ఇన్చార్జి, తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు తెలిపారు. దీనికి అనుగుణంగా చర్యలు తీసుకోవడంపై ఆయన గురువారం కపిలతీర్థం సమీపంలోని టాస్క్ ఫోర్సు కార్యాలయాన్ని సందర్శించారు. టాస్క్ ఫోర్సు ఎస్పీ పీ.శ్రీనివాస్ ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అధికారులతో సమావేశమైన ఎస్పీ టాస్క్ ఫోర్సు పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఆపరేషనల్ టీమ్ లతో అభిప్రాయ సేకరణ చేసి, ఆపరేషన్ విధానాలను తెలుసుకున్నారు. సమాచారం పొందే విధానం నుంచి స్మగ్లర్లను పట్టుకోవడానికి తీసుకుంటున్న చర్యలను ఆపరేషనల్ టీమ్స్ వివరించారు. స్మగ్లర్లను నిరోధించడానికి మరిన్ని వ్యూహాలను చేపట్టాల్సి ఉందని సూచించారు. ఇప్పటి వరకు టీమ్స్ చేపడుతున్న చర్యలను అభినందిస్తూ, మరింత ముందుకు వెళ్లడానికి తీసుకోవాల్సిన విధానాల గురించి సూచనలు చేశారు. ప్రతి అధికారి చేపడుతున్న విధులను తెలుసుకుని, వారికి సూచనలు అందజేశారు. ముఖ్యంగా అడవుల్లోకి వెళ్ళినపుడు ఉపయోగిస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, సాంకేతికంగా చేపడుతున్న సమాచార వ్యవస్థ గురించి తెలుసుకుని పలు సూచనలు చేశారు. ఆయనకు కడప, రైల్వే కోడూరు, సానిపాయ సబ్ కంట్రోల్ ల నుంచి జరుగుతున్న ఆపరేషన్ విధానాలను టాస్క్ ఫోర్సు ఎస్పీ పీ.శ్రీనివాస్ వివరించారు. బేస్ క్యాంపులు, ఎంట్రీ ఎగ్జిట్ పాయంట్ల గురించి తెలియజేశారు. తరువాత టాస్క్ ఫోర్సు ఆవరణలోని కంట్రోల్ రూమ్, పోలీసు స్టేషన్, అక్కౌంట్స్ ఆఫీసు, రవాణా ఆఫీసు తదితర ప్రాంతాలను సందర్శించారు. అవసరమైతే తిరుపతి జిల్లా పోలీసు విభాగం సహకారం కూడా తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ చెంచుబాబు, ఆర్ఐ (ఆపరేషన్స్) సురేష్ కుమార్ రెడ్డి, ఎసీఎఫ్ శ్రీనివాస్, సీఐలు శ్రీనివాసులు, సురేష్ కుమార్, ఎస్ఐ రఫీ, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

డాయ్ యాప్ ద్వారా 16 కోట్లు స్వాహ

విశాలాంధ్ర - పలమనేరు : పట్టణంలో డాయ్ యాప్ ద్వారా 16 కోట్లు స్వాహ చేసిన సంఘటన గురువారం వెలుగు చూసింది. బాధితులు తెలిపిన వివరాల మేరకు డాయ్ యాప్ లో ఎవరికి ఎంత స్తోమత ఉందో అంత ఇన్వెస్ట్మెంట్ పెడితే అందుకు రెట్టింపుగా ఆదాయం వస్తుందని మొదట డాయ్ యాప్ నిర్వాహకులు నమ్మ పలికారని తెలిపారు. మొదటలో ఇన్వెస్ట్మెంట్ పెట్టిన కొంతమంది ప్రోత్సాహక నగదు పంపిణీ చేసి నమ్మించారన్నారు. డాయ్ యాప్లో సామాన్య జనంతో పాటు, ప్రభుత్వ ఉద్యోగులు ఉండటంతో నమ్మి ఇన్వెస్ట్మెంట్ పెట్టామని వాపోయారు. ఇందులో ప్రధానంగా డి ఆర్ డి ఎకు సంబంధించిన ఆర్పీలు ముఖ్యపాత్ర పోషించారని యాప్ నిర్వాహకులు ఇవ్వకపోయినా మీరు పెట్టిన ఇన్వెస్ట్మెంట్ డబ్బులు మేమే తిరిగి ఇస్తామని చెప్పారన్నారు. డాయ్ యాప్లో సుమారు 5000 మంది ఇన్వెస్టర్లు ఉన్నారని వివరించారు. కొంతమంది అప్పుచేసి ,మరి కొంతమంది ఇంటిలో ఉన్న బంగారు నగలను తాకట్టు పెట్టి ఇన్వెస్ట్మెంట్ పెట్టామని కన్నీరు మున్నీరు అవుతున్నారు. రెండు నెలలు కావస్తున్న పెట్టిన పెట్టుబడికి తిరిగి డబ్బు రాకపోవడంతో, యాప్ నిర్వాహకులు, ఆర్పీల నుండి సరైన సమాధానం రాకపోవడంతో విది లేక పోలీసులు ఆశ్రయించామని తెలిపారు. ఈ విషయం పైన అధికారులు స్పందించి మోసం చేసిన డాయ్ యాప్ నిర్వాకులపై చర్యలు తీసుకుని వారి నుండి కట్టిన నగదును తీసి ఇవ్వాలని కోరుతున్నారు.

పనులు యంత్రాలకు..

బిల్లులు అక్రమార్కులకు

- ఉపాధిలో అవినీతి డొంక కదిలేనా.? - యర్రావారిపాళ్యం ఉపాధిలో ఆడిట్ షురూ
- పెద్ద మొత్తంలో బిల్లులు గోల్ మాల్ - వెలుకి తీస్తారా.. కప్పెట్టేస్తారా..?
- గ్రామాల్లో విస్తృతంగా సభలు - లబ్ధిదారులకు తెలియకుండానే బిల్లులు మంజూరు చేసిన వైనం
- అక్రమార్కుల జేబుల్లోకి చేరిన కూలీల పేరిట పాపపు సొమ్ము

విశాలాంధ్ర - యర్రావారిపాళ్యం: నిరుపేదలకు పని కల్పిస్తూ ఉపాధి కోసం వలసలు పోకూడదని ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని తీసుకొచ్చింది. వంద రోజులు పని కల్పిస్తూ భరోసా ఇచ్చింది. ఈ పథకం ప్రారంభంలో ప్రతి కూలీకి పని దినాలు కల్పిస్తూ గ్రామీణ ప్రాంతాల్లో బీడు భూములు సాగుభూములుగా మారేవి. మండలంలో విస్తృతంగా యంత్రాలకు పని చెప్పి.. అక్రమార్గంలో బిల్లులు నేతల జేబుల్లోకి చేరింది. ఈ వ్యవహారం అంతా అందరికీ తెలిసినట్టుగానే ఉంది. కాగా గత వారం రోజులుగా మండలంలో ఉపాధి హామీ సామాజిక తనిఖీలు చేపడుతున్నారు. ప్రతి పంచాయతీలోనూ ప్రత్యేక బృందాలు పనులను తనిఖీ చేస్తున్నారు. అవన్నీ ఉపాధి లక్ష్యానికి గాడి తప్పి అక్రమ మార్గంలో దోచుకున్న సొమ్మేనని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆడిట్ బృందం పారదర్శకంగా తనిఖీలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ముందుగానే యంత్రాలతో చేసిన పనులు.ఉపాధి హామీలో పని మొదలు పెట్టడానికి అనుమతులు వచ్చిన వెంటనే యంత్రాలతో పని చేసేశారు. ఆడిట్లో ఫోటోలు చూపెట్టడానికి మరో ఒకరిని ఆ పని ప్రదేశంలో నిలబెట్టి ఫోటోలు దిగి, కూలీలే పని చేసినట్లు సాక్షాలుగా మారుస్తున్నట్లు సమాచారం. అనుకూల వ్యక్తుల పేర్లతో బిల్లులు కాజేస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. పనులకు సంబంధించి బ్యాంకు ఖాతాల్లో జమ అయిన సొమ్మును డ్రా చేయడానికి అక్రమార్కులు ఏ ఈ పి ఎస్ యాప్ ద్వారా నగదు విత్ డ్రా చేస్తున్నట్లు తెలుస్తోంది. పాత పనులకే బిల్లులు.గతంలో ఉపాధి హామీలో జరిగిన పనులకి మళ్లీ మళ్లీ బిల్లులు చేస్తారని, అలా జరిగినవే మండలంలో ప్రతి బిల్లు అనే వాదనలు వినిపిస్తున్నాయి. పంట సంజీవని పేరుతో ఫాం పాండ్లను, పొలం చుట్టూరా కందకాలు, మామిడి తోటలు పెంపకం, సప్లై ఛానల్ వంటి పనులకు సంబంధించి పాతవి, తాజాగా చేసినట్లు చూపి బిల్లులు కాజేశారు అన్నది ప్రధాన అభియోగం. ఆడిట్లో డొంక కదిలేనా..? వారం రోజులుగా మండలంలో జరుగుతున్న సోషల్ ఆడిట్ లో ఏడాది పాటు చేసిన అవినీతిని వెలికితీస్తారా.. అధికారులకు వంత పాడి.. అసలు విషయాలను దాచేస్తారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. లబ్ధిదారులకు తెలియకుండానే పెద్ద మొత్తంలో బిల్లులు కాజేశారని ఫీల్డ్ అసిస్టెంట్లపై అనేక ఆరోపణలు ఉన్నాయి. అయితే

దొంగ ఓట్ల కేసు దర్యాప్తును వేగవంతం చేయండి

పవన్ కళ్యాణ్ ను కోరిన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

విశాలాంధ్ర - తిరుపతి : దొంగ ఓట్ల కేసు దర్యాప్తును వేగవంతం చేయాలని జనసేన అధ్యక్షులు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా పవన్ కళ్యాణ్‌ను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివా సులు ఆయన తనయుడు ఆరణి మదన్‌లు బుధవారం కలిశారు. తిరుపతి నియోజకవర్గ సమస్యలను పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్ళగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. అయితే దొంగ ఓట్ల కేసు దర్యాప్తు సాధారణ ఎన్నికల ముందు నుంచి ఎవరూ పట్టించుకోవడం లేదని పవన్ కళ్యాణ్ దృష్టికి ఎమ్మెల్యే తీసుకెళ్ళగా తాను డిజిపి, రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారితో మాట్లాడుతానని హామి ఇచ్చినట్లు ఆరణి శ్రీనివాసులు తెలిపారు. మరోవైపు టిడిఆర్ బాండ్ల స్కాంపై విజిలెన్స్ విచారణ జరిపించాలని కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. మాస్టర్ ప్లాన్ రోడ్ల కారణంగా భూమి కోల్పోయిన ప్రతి ఒక్కరికి పరిహారం అందేలా చూడాలని పవన్ కళ్యాణ్ ను కోరినట్లు ఆయన చెప్పారు.

ఆరోగ్యమైన భూమితోనే అధిక దిగుబడులు

విశాలాంధ్ర -బాలాయపల్లి : సాగు భూములు ఆరోగ్యంగా ఉంటేనే పంటలలో అధిక దిగుబడి వస్తాయని జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం ఏడిఏ భాస్కరయ్య తెలిపారు. బాలాయపల్లి మండలం ఊట్లపల్లి లో ' ఆత్మ సహకారంతో ప్రకృతి వ్యవసాయంపై ఆయన శిక్షణ ఇచ్చారు. అవసరానికి మించి భూములకు రైతులు రసాయనిక ఎరువులు, కలుపు మందులు వాడకం వలన భూములు జవజీవాలను కోల్పోతున్నాయని వివరించారు. దీనివలన భూములు నిర్జీవమై, మునుముందు సాగుకు పనికి రాకుండా పోతాయని అన్నారు. ఈ పరిస్థితుల నుండి గట్టెక్కడానికి ప్రకృతి వ్యవసాయ పద్ధతులు చాలా ఉపయోగపడతాయని తెలిపారు. ప్రకృతి వ్యవసాయంతో, భూమి, పంటలు, ప్రజలు, పర్యావరణం ఆరోగ్యంగా ఉంటాయన్నారు. ఈ వాస్తవాన్ని గురించి రాష్ట్ర, జాతీయ ప్రభుత్వాలు ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నాయని తెలిపారు. పంటల సాగులో ఆచరించవలసిన ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, జీవామృతం, కషాయాల తయారీపై ఆంధ్రప్రదేశ్ ప్రకృతి వ్యవసాయ విభాగం మాస్టర్ ట్రైనర్ మల్లికార్జున రైతులకు వివరించారు. జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం ఏఓ వేణుగోపాలరావు వరి సాగులో చేపట్టవలసిన మేలైన సాగు పద్ధతులు గురించి వివరించారు. మండల వ్యవసాయ అధికారి శిరీషా నేల ఆరోగ్యాన్ని కాపాడుటకు వ్యవసాయ శాఖ చేపడుతున్న చర్యల గురించి వివరించారు. కార్యక్రమంలో రైతులతో పాటు గ్రామ సర్పంచి సుధాకర్ బాబు , వ్యవసాయ సహాయకులు సలీం, ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ స్వర్ణలత పాల్గొన్నారు.

సర్పంచ్ చొరవతో ఎస్టీ కాలనీకి స్మశాన స్థలం కేటాయింపు

విశాలాంధ్ర - పిచ్చా టూరు : పిచ్చాటూరు సర్పంచ్ కేజీ రోస్ రెడ్డి చొరవతో పిచ్చాటూరు టీచర్స్ కాలనీ, ఎస్టీ కాలనీ స్మశాన వాటికలకు అధికా రులు స్థలం కేటాయించారు. పిచ్చాటూరు టీచర్స్ కాలనీ, ఎస్టీ కాలనీ లకు గతంలో ఉన్న స్మశాన వాటిక భూములను టూరిజం అభివృద్ధికి ఇరిగేషన్ శాఖ స్వాధీనం చేసుకుంది. ఈ క్రమంలో టీచర్స్ కాలనీ, ఎస్టీ కాలనీ ప్రజలు తమకు వేరే చోట స్మశాన వాటికకు స్థలం చెప్పాలని సర్పంచ్ కేజీ రోస్ రెడ్డి వద్ద మొర పెట్టుకున్నారు. స్పందించిన సర్పంచ్, ఇరిగేషన్ ఈఈ మదన గోపాల్ తో స్మశానం సమస్య పరిష్కరించాలని కోరగా, అందుకు ఆయన సానుకూలంగా స్పందించి అరణియార్ లోనే మరోచోట స్మశాన వాటికకు స్థలం చూపినట్లు సర్పంచ్ వెల్లడించారు. అధికారులు చూపిన స్థలంలో మట్టితోలి చదనుచేసి స్మశాన వాటికకు వినియోగించుకునే విధంగా ఏర్పాటు చేశారు. తాము కోరిన వెంటనే స్మశాన వాటిక స్థలం కేటాయించిన అధికారులకు సర్పంచ్ కేజీ రోస్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్య క్రమంలో మురాజీ, నాగయ్య,మురుగేశ్, బాబు, శేఖర్ పాల్గొన్నారు.

బడ్జెట్లో ఆంధ్రప్రదేశ్‌కి అన్యాయం

- సిపిఎం సెంట్రల్ శాఖ కార్యదర్శి జోగి శివ కుమార్

విశాలాంధ్ర - గూడూరు : బిజెపి ప్రభుత్వం బడ్జెట్లో ఆంధ్ర రాష్ట్రానికి తీవ్రమైన అన్యాయం చేస్తూ ప్రవేశపెట్టిన బడ్జెట్ ని సి.పి.ఎం దేశ వ్యాప్తంగా ఇచ్చినటువంటి పిలుపులో భాగంగా గూడూరు లోని టవర్ క్లాక్ సెంటర్ లో గురువారం నిరసన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సి.పి.ఎం. శాఖ కార్యదర్శి జోగి శివకుమార్, పి. శ్రీనివాసులు మాట్లాడుతూఅమరావతి రాజధాని నిర్మాణానికి 15000 వేల కోట్ల అప్పు ప్రకటించడం దుర్మార్గం అన్నారు. దీన్ని గ్రాంట్ గా ఇవ్వాలని సి.పి.ఎం. పార్టీ డిమాండ్ చేయడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిందని, విభజన చట్టంలోని ప్రత్యేక హోదా గాలికి వదిలేసిందని పేర్కొన్నారు. ప్రత్యేక ప్యాకేజీ కాని నిధులు లేవు. కేవలం అప్పులతో సరిపెట్టిందని పేర్కొన్నారు., పోలవరంప్రాజెక్టు నిర్మాణానికి ప్రత్యేక నిధుల కేటాయింపు లేదు అని, కడప స్టీల్ ఫ్యాక్టరీ, రామాయపట్నం ఓడరేవు, విశాఖపట్నం రైల్వే జోను ఊసే లేదని, విశాఖ స్టీలు ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని ప్రైవేటీకరణ చేయబోమని ప్రకటన లేదని, ప్రజా పంపిణీ వ్యవస్థ, ఆహార ధాన్యాలు, ఎరువులు ,పెట్రోలు, డీజీలు, గ్యాస్ సబ్సిడీలపై కోత విధించడం దుర్మార్గం అన్నారు. రాష్ట్రంలోని టి.డి.పి ప్రభుత్వం కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వానికి భజన చేయడం మానుకొని విభజన చట్టంలోని హామీలను అమలు జరిపేందుకు నిధులు రాబట్టేందుకు కృషి చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి.వి.రమణయ్య, యస్.సురేష్, పుట్టా శంకరయ్య, చంద్రయ్య, యస్కె.మున్నా తదితరులు పాల్గొన్నారు.

ఆశ మధ్యాహ్నం భోజన కార్మికులకు

అంగన్వాడీలకు జీతాలు పెంచాలి

గ్రీన్‌అంబాసిడరకార్మికులకు పెండింగ్ లో ఉన్న జీతాలు చెల్లించాలి

ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య డిమాండ్

విశాలాంధ్ర - పుత్తూరు టౌన్: నగిరి నియోజకవర్గం మండలంలో ఉన్న ఏఐటీయూసీ అనుబంధ సంఘాల కార్మికులు విస్తృత స్థాయి సమావేశం ఏఐటిసి మండల నాయకులు ఏసు పాదం అధ్యక్షతన జరిగింది ఈ సమావేశాన్ని ముఖ్య అతిథులుగా ఏఐటిసి జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య పాల్గొని మాట్లాడుతూ ఈరోజు రాష్ట్రం నా అధికారానికి వచ్చిన కొత్త ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతూ ఈరోజు రాష్ట్రంలో ఉన్నటువంటి ఆశా మధ్యాహ్నం భోజన పథకం అంగన్వాడి గ్రీన్ అంబాసిడర్ కార్మికులకు జీతాలు పెంచాలని కార్మికుల మహిళా కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించి జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు గ్రీన్ అంబాసిడర్ కార్మికులు పెండింగ్ లో ఉన్న సుమారు 25 నెల జీతాలు చెల్లించాలని కార్మికుల కుటుంబాలు ఆదుకోవాలని డిమాండ్ కార్మికులకు పని భారం తగ్గించి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారుఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సుజాత మధ్యాహ్న భోజనం పథకం జిల్లా సహాయ కార్యదర్శి పరిమళ గ్రీన్ అంబాసిడర్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ పాము యేసు పాదం నాయకులు లక్ష్మీ లత షీబా భవనా ముని లక్ష్మి , లక్ష్మి ఎస్ పాదం రవి సుధాకర్ ఎలుమలై ఆశ మధ్యాహ్నం భోజనం పథకం గ్రీన్ అంబాసిడర్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర -తిరుపతి : పిడిఎస్ఓ రాష్ట్ర పిలుపులో భాగంగా జూనియర్ కళాశాల సమస్యల పరిష్కరించాలని పిడిఎస్ఓ తిరుపతి జిల్లా ఆధ్వర్యంలో తిరుపతి, ఎంఆర్ పల్లి సర్కిల్ వద్ద ఆందోళన చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఆర్.ఆషా మాట్లాడుతూ ప్రధానంగా రాష్ట్రంలో ఇంటర్ కళాశాలలు మౌలిక సదుపాయాలు కూడా లేక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి. పాఠ్యపుస్తకాల పంపిణీ లేదు. మధ్యాహ్న భోజన పథకం రద్దు చేశారు. ఎన్నో ఏళ్లగా రెగ్యులర్ అధ్యాపకుల నియామకం లేక ఔట్సోర్సింగ్, గెస్ట్, కాంట్రాక్టు లెక్చరర్ల తోటి కాలేజీలు నడుస్తున్నాయి. ప్రైవేటు, కార్పొరేటు కాలేజీలు ఫీజులు అడ్డగోలుగా దోచుకుంటున్నా ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. కనుక రాష్ట్రంలో ఖాళీగా ఉన్న జూనియర్ లెక్చరర్ పోస్టులన్నిటిని భర్తీ చేయాలి. మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలి. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను ఉచితంగా అందించాలి. ఎటువంటి మినహాయింపులు నిబంధనలు లేకుండా విద్యార్థులందరికీ ఫీజు రిఎంబర్స్మెంట్, స్కాలర్షిప్ లు వర్తింప చేయాలి, ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీల ఫీజుల దోపిడీని అరికట్టాలి, పెరుగుతున్న విద్యార్థులకు అనుగుణంగా జూనియర్ కళాశాల నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు స్రవంతి, విష్ణు మొదలైన జూనియర్ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఐటీడీపి కార్యకర్తకు అండగా ఉంటాం

ఐటీ మంత్రి నారా లోకేష్

విశాలాంధ్ర-రామసముద్రం: ఐటీడీపీ కార్యకర్తలకు అండగా ఉంటానని ఐటీ మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చినట్లు కాశి శ్రీరామ్ వాల్మీకి మదనపల్లి ఐటీడీపి రామసముద్రం ఐటీడిపి అశోక్ కుమార్ గురువారం తెలిపారు. బుధవారం అమరావతిలో లోకేశ్‌ను కలిసి తమ సమస్యలను వివరించినట్లు తెలిపారు. టీడీపీ ప్రతి పత్యక్షంలో ఉన్నప్పుడు పార్టీ అధికారంలోకి రావడానికి సోషల్ మీడియాలో, నియోజకవర్గంలో పార్టీ ఆదేశించిన ప్రతి కార్యక్రమాన్ని విజయవంతంగా నడిపామని ఐటిడిపి కార్యకర్తల సేవలను గుర్తించాలని కోరడం జరిగిందన్నారు. దీనిపై నారా లోకేష్ స్పందిస్తూ ఈరోజు తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడానికి సోషల్ మీడియా, ఐటిడిపి కృషి అభనందనీయమన్నారు.

పనులు యంత్రాలకు.. బిల్లులు అక్రమార్కులకు

(మొదటి—పేజి తరువాయి) తాజాగా ప్రభుత్వం మారడంతో ఐదు మంది ఫీల్డ్ అసిస్టెంట్లు వారికి వారుగా రాజీనామా చేసి ఉద్యోగం మానేశారు. వారు చేపట్టిన పనులకు తాజాగా ఆడిట్ చేపట్టడంతో వారిలో ఒకింత ఆందోళన మొదలైంది. ఐదేళ్లపాటు వైసీపీ నేతలతో అంట కాగి పెద్ద మొత్తంలో వారు దోచుకోవడం తోపాటు నాయకులకు బిల్లులు సమకూర్చారు అన్నది స్పష్టంగా తెలుస్తోంది. పైగా ఎన్నికల సమయంలో వైసీపీ తరఫున ప్రచార కార్యక్రమాలకు అన్ని తామై ఫీల్డ్ అసిస్టెంట్లు పాపపు సొమ్మును ఖర్చు చేశారన్నది తేటతెల్లమవుతోంది. పారదర్శకంగా ఆడిట్ చేపట్టి అక్రమార్కుల భరతం పట్టాలని పలువురు కోరుతున్నారు.

లారీని ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర - దొరవారిసత్రం : దొరవారి సత్రం మండల పరిధిలోని విఎంఆర్ నగర్ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు చోటుచేసుకున్నాయి. స్థానికులు వివరాలు మేరకు బూదురు గ్రామానికి చెందిన బుడతొట్టి వాసు సూళ్లూరుపేట నుండి బూదురుకు మోటార్ సైకిల్ వస్తుండగా అదే మార్గంలో వస్తున్న లారీ ఢీకొంది. దీంతో వాసుకి తీవ్ర గాయాలు తగిలాయి. గాయపడిన వాసుని చికిత్స నిమిత్తం సూళ్లూరుపేట టోల్ ప్లాజా అంబులెన్స్ లో సూళ్లూరుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంబేద్కర్ భవనం నిర్మాణ స్థలానికి

స్థలం మంజూరు చేయండి

విశాలాంధ్ర-పీలేరు: అంబేద్కర్ భవనం నిర్మాణం కొరకు స్థలం మంజూరు చేయాలని మాల మహానాడు ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుట్టం నారాయణ ఆధ్వర్యంలో మాల మహానాడు ఐక్యవేదిక సభ్యులు స్థానిక తహసిల్దార్ ను వినతి పత్రం ద్వారా సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీలేరు మండలం గూడరేవుపల్లి పంచాయతీ సర్వేనెంబర్ 200/3 లో 53 సెంట్లు తమ కమిటీ తరఫున అంబేద్కర్ భవన నిర్మాణం స్థలం కొరకు కలెక్టర్కు తాహసిల్దార్లకు ఎన్నో సార్లు విన్నవించిన స్పందించడం లేదని వెంటనే స్థలాన్ని మంజూరు చేయాలని మాల మహానాడు ఐక్యవేదిక సభ్యులు డిమాండ్ చేశారు.

భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి. సిసోడియా

విశాలాంధ్ర-మదనపల్లె: రెవెన్యూ అధికారులు భూ సమస్యలు పెండింగ్ లేకుండా వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (రెవెన్యూ) ఆర్.పి. సిసోడియా సంబంధిత అధికారులకు సూచించారు. గురువారం సబ్ కలెక్టర్ కార్యాలయంలోని హెచ్ఎన్ఎస్ఎస్ కార్యాల యంలో మదనపల్లి సబ్ డివిజన్‌కు సంబంధించిన భూ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (రెవెన్యూ) ఆర్.పి. సిసోడియా, జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి, సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్, లు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (రెవెన్యూ) ఆర్.పి. సిసోడియా మాట్లాడుతూ... భూ సమస్యలు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. మదనపల్లె డివిజన్ లో భూ సమస్యల అధికంగా ఉన్నాయని అధికారులు వీటిపై ప్రత్యేక దృష్టి పెట్టి పెట్టాలన్నారు. అర్జీల స్వీకరణ కార్యక్రమంలో ప్రజలు అధిక సంఖ్యలో హాజరై తమ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి. సిసోడియా గారికి తెలియజేశారు. ఈ సమస్యలన్నీ వెంటనే పరిష్కరించాలని ఆయన సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు, తహసిల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నివారణపై అవగాహన

విశాలాంధ్ర - గూడూరు : గూడూరు పురపాలక పరిధి లోని చెన్నూరు లోని ఎంపియుపి పాఠశాలలో అంగన్వాడీ కార్య కర్తలు బేటి బచావో- బేటి పడావో కార్యక్రమంలో భాగం గా బాల్య వివాహాల నివారణపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ శివ జ్యోతి మాట్లాడుతూ బాలికలను రక్షించడం అందరి బాధ్యత అన్నారు. అనంతరం విద్యార్థినులకు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన కల్పించారు. బాలికలు రక్షణ పొందేందుకు చైల్డ్ హెల్ప్ లైన్ 1098 ను వివరించారు. బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.అనంతరం ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు రమణమ్మ, భువనేశ్వరి, లక్ష్మి, పావని, పాఠశాల హెచ్.ఎం సిద్దయ్య, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ప్రకృతి వ్యవసాయ సాగుపై అవగాహన అవసరం

: అడిషనల్ డిపిఎం పట్టాభి రెడ్డి

విశాలాంధ్ర - తిరుపతి రూరల్ : ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయ సాగు వైపు ప్రోత్సహిం చాలని ఆ శాఖ అడిషనల్ డీపీఎం పట్టాభిరెడ్డి అన్నా రు. గురువారం రాయల చెరువు కట్టవద్దగల రాయలవారి మండపంలో సిబ్బందితో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక కేడర్ తమ పొలాలలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో పంటలను సాగు చేస్తూ రైతులకు ప్రకృతి వ్యవసాయ చేయు విధానం పై అవగాహన కల్పిస్తూ రైతులను ప్రకృతి వ్యవసాయం చేసే విధంగా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని గుర్తు చేశారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలను ఆహారంగా తీసుకోవడంతో మన ఆరోగ్యంతో పాటు భూమి ఆరోగ్యం కూడా ఉంటుందని రైతులకు తెలియజేయాలని గుర్తు చేశారు. ఏటీఎం ఏ గ్రేడ్ మోడల్స్ సాగు ద్వారా అధిక దిగుబడులను పొందొచ్చని సూచించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎం టీ రంగయ్య మార్కెటింగ్ ఎం టి రాగమ్మ, సుజాత మేఘన సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్ వాడీ కేంద్రాల్లో
పోషకాహార కూరగాయల తోటలు పెంచాలి

విశాలాంధ్ర- కార్వేటి నగరం: అంగన్వాడీ కేంద్రం ఆవరణాల్లో పోషకాలు అందించే తోటల పెంపకాన్ని విధిగా చేపట్టాలని రాస్- కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత డాక్టర్ శ్రీనివాసులు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పెద్ద దళితవాడ అంగన్వాడీ కేంద్రంలో పోషకాహార తోటల పెంపకంపై అంగన్వాడీ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సీనియర్ శాస్త్రవేత మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రం ఆవరణంలో చిన్నారులకు, గర్భిణీలకు, బాలింతలకు అవసరమైన పౌష్టికాహారం అందించే తోటలను పెంచేలా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో కూరగాయలు, ఆకుకూరలు పండించడమే కాకుండా మంచి పోషక విలువలు కలిగిన కూరగాయలను అందుబాటులోకి తీసుకురావడమే రాస్ -కృషి విజ్ఞాన కేంద్రం యొక్క ముఖ్య ఉద్దేశమని చెప్పారు. అదే విధంగా అంగన్వాడీ కేంద్రాల్లో విధులు నిర్వహించే సిబ్బంది తమ గ్రామాల్లో కూడా పోషకాలతో కూడిన కూరగాయాలు పండించే విధంగా క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. అనంతరం డాక్టర్ ఎబీ శ్రీలత మాట్లాడుతూ పోషకాహార తోటలు పెంచుకొనే విధానం. వివిధ కూరగాయలైన ఆకు కూరలను సేంద్రియ పద్ధతిలో పెంచే విధానంపై క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పలువురు అంగన్వాడీ సిబ్బంది. పాల్గొన్నారు.

రైతుల సహాయ సహకారంతో రోడ్డు మార్గం పునరుద్ధరణ

సి యల్ ఎన్ పల్లి సర్పంచ్ దుడ్డు వేణు ఆధ్వర్యంలో వెడల్పైన రోడ్డు మార్గం ఏర్పాటు

ఎమ్మెల్యే చొరవ చూపించి సిసి రోడ్డును మంజూరు చేయాలని గ్రామస్థులు రైతులు విన్నపం

విశాలాంధ్ర - తిరుపతి: తిరుపతి జిల్లా వరదయ్యపాలెం మండలం సి యల్ఎన్ పల్లి గ్రామ పంచాయతీ కి చెందిన చావాలి హరిజనవాడ మరియు ఆరికిచేలు గ్రామానికి వెల్లు రహదారి గత 20 సంవత్సరాల పురాతన రోడ్డు మార్గం గా ఉండి .ఒక వెహికల్ వెళ్ళడానికి మాత్రమే అవకాశం ఉండేది.ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా ఆ రోడ్డు మార్గాన్ని వెడల్పు చేయాలని ఎన్ని వినతులు ఇచ్చినా ఫలితం లేకపోయింది.ఇరుకైన రోడ్డు మార్గంతో ప్రయాణికులు ,వాహన దారులు ఎక్కువగా ఇబ్బంది పడుతూ ఉండేవారు. దీని దృష్టిలో పెట్టుకుని, సి యల్ ఎన్ పల్లి సర్పంచ్ దుడ్డు వేణు ఆధ్వర్యంలో గ్రామస్థులతో,రైతులతో సమావేశం ఏర్పాటు చేసి ,ఇరుకైన రోడ్డు మార్గాన్ని ,వెడల్పు అయిన రోడ్డు మార్గంగా ఏర్పాటు చేయడానికి రైతులు ముందుకు రావాలని తమ పొలంలో నుంచి కొంత భాగాన్ని స్వచ్ఛందంగా రోడ్డు మార్గానికి ఇవ్వాలని కోరగా, అందుకు రైతులు అంగీకారం తెలిపారు.ధీంతో సర్పంచ్ దుడ్డు వేణు ఆధ్వర్యంలో ఎట్టకేలకు ఇరుకైన రోడ్డు మార్గానికి స్వస్తి చెప్పి,వెడల్పైన రోడ్డు మార్గాన్ని ఏర్పాటు చేశారు.ధీంతో ప్రయాణికులు,వాహన దారులు గ్రామస్థులు సర్పంచ్ వేణు కి,స్థానిక రైతులకు కృతజ్ఞతలు తెలిపుతూ హర్షం వ్యక్తం చేశారు. సత్యవేడు శాసనసభ్యులు కోనేటి ఆదిమూలం మా పంచాయితీ పై చొరవ చూపించి సి సి రోడ్డును మంజూరు చేయాలని గ్రామస్థులు ,రైతులు సర్పంచ్ దుడ్డు.వేణు కోరుతున్నారు.

విద్యార్థులకు పండ్ల మొక్కలను పంచండి

విశాలాంధ్ర-పలమనేరు :రూరల్ మండలం దొడ్డి పల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పలమనేరు ప్రకృతి కన్వీనర్ మల్లిచెట్ల దేవేంద్ర, జె. టి .డి. మరియు బెంగుళూరు యక్ష వారి సౌజన్యంతో 50 పండ్ల మొక్కలను పంచడం జరిగింది. 25 లక్నో రకం జామ, 10 సపోటా, 10 నిమ్మ మరియు ఐదు అల్లనేరేడు మొక్కలను విద్యార్థులకు పంపిణీ చేయడం జరిగినది. దేవేంద్ర మాట్లాడుతూ ఈ మొక్కలను సక్రమంగా పెంచినట్లయితే ప్రతి సంవత్సరం వారికి మరికొన్ని పండ్ల మొక్కలను ఇస్తామని చెప్పారు. పర్యావరణ ప్రేమికులు గ్రామాలలో చదివే విద్యార్థులకు పండ్ల మొక్కలను ఇచ్చి పర్యావరణ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ప్రధానోపాధ్యాయులు నేతాజీ మాట్లాడుతూ విద్యార్థులు మొక్కలపై మమకారం పెంచుకొని వాటిని పెంచి పర్యావరణానికి మేలు చేయాలని కోరారు. చివరగా అందరూ “”నా చెట్టూ నా గాలి “”అని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జె టి డి వాలంటీర్ నవీన్ జీవశాస్త్ర ఉపాధ్యాయులు సంపత్, భూదేవి మరియు మరియు ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డాక్టర్ బి సి రాయల్ జన్మదిన సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానానికి 10 లక్షల రూపాయల చెక్కును టిటిడి ఈవోకు గురువారం అందించారు.

వైభవంగా మహాభరత ఉత్సవాలు

ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర -తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండలం పేరూరు పంచాయతీలో శ్రీకృష్ణ ద్రౌపది ధర్మరాజులస్వామి మహాభారత ఉత్సవాలు అంగరంగవైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం ప్రముఖ భాగవతారిణి మునిలక్ష్మి భీష్మ అస్త్రనిష్క్రమణ ఘట్టాన్ని హరికథ ద్వారా ఆలపించారు.రాత్రి ఆలయ ప్రాంగణంలో కీచకవధ నాటకం ప్రదర్శన జరిగింది. ఉత్సవాల సందర్భంగా హరేకృష్ణ నేత్రాలయ ఆధ్వరంలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి గ్రామస్తుల నుంచి విశేష స్పందన లభించింది. నేత్రాలయంకు చెందిన వైద్య బృందం డాక్టర్ సిద్దార్థరెడ్డి, డాక్టర్ శంకరయ్య ఆధ్వర్యంలో 238 మందికి ఉచితం కంటి పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త చెవిరెడ్డి అరుణాచలరెడ్డి మాట్లాడుతూ 29వ మహాభారత ఉత్సవాలను భక్తులు, గ్రామస్తుల సహకారంతో వైభవంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు.ఉత్సవాల్లో భాగంగా ఈనెల 28వ తేది దుర్యోధన వధ కార్యక్రమం ఉంటుందన్నారు. ఆమేరకు దుర్యోధన ప్రతిమ తయారీ పనులను ఆయన పరిశీలించారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ పెద్దలు మట్టామోహనమునిసిద్దారెడ్డి, మూలం సుదర్శనరెడ్డి, ముకుందరెడ్డి పాల్గొన్నారు.

విఆర్‌కు భాకరాపేట ఎస్సై

విశాలాంధ్ర - తిరుపతి : భాకరాపేట ఎస్సై విజయ్ కుమార్ నాయక్ ను విఆర్ కు బదిలీ చేస్తూ తిరుపతి ఎస్పీ సుబ్బారాయుడు ఆదేశాలు జారీ చేశారు. ఉన్నతాధికారుల సూచనలను పాటించకపోవడంతో పాటు సివిల్ కేసుల్లో జోక్యం చేసుకున్నందుకు మరియు క్రమశిక్షణ రాహిత్యం చేసినందుకుగాను బదిలీ చేస్తున్నట్టు జిల్లా ఎస్పీ వి ఆర్ కు పంపించడం జరిగింది పోలీస్ సిబ్బంది క్రమశిక్షణతో స్టేషన్కు వచ్చే బాధితుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని తిరుపతి ఎస్పీ సూచించారు.

విద్యార్థులకు గొడుగులు పంపిణీ

విశాలాంధ్ర - గూడూరు : గూడూరు పట్టణంలోని రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం నరసింగరావుపేట బాలసదన్‌లో విద్యార్థులకు గొడుగులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని దాతగా రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు అశోక్ చక్రవర్తి వ్యవహరించారు. ఈ సందర్భంగా రోటరీ అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షులు అశోక్ చక్రవర్తి రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా బాల సదన్ లో సేవా కార్యక్రమం చేపట్టడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో పిడిజి కె.మునిగిరీష్ పాస్ట్ అసిస్టెంట్ గవర్నర్ రోటేరియన్ దశరధరామిరెడ్డి పాస్ట్ ప్రెసిడెంట్స్ పి.వి.కృష్ణయ్య రాజు చక్రవర్తి రవీంద్ర రెడ్డి సురేష్ రెడ్డి రాంప్రసాద్ జగదీష్ నాయుడు బలరాం రెడ్డి బాలసదన్ మేనేజర్ అరుణ సిబ్బంది , తదితరులు పాల్గొన్నారు.

వీర మహిళల ఆధ్వర్యంలో అన్నదానం

విశాలాంధ్ర-శ్రీకాళ హస్తి: జనసేన పార్టీ వీర మహిళలు గాయత్రి, శారద, నిర్మల ఆధ్వ ర్యంలో గురువారం శ్రీకాళ హస్తి పట్టణం ఆర్టీసీ బస్టాండు కూడలిలో అన్నదానం చేశారు. శ్రీకాళహస్తి నియోజకవర్గ జనసేన పార్టీ ఇంఛార్జి వినుత కోటా సూచనలతో ఆంధ్రుల అన్నపూర్ణ డొక్కా సీతమ్మ స్ఫూర్తితో ప్రతి గురువారం అన్నదానం చేస్తున్నట్లు వీర మహిళలు ఈ సందర్భంగా తెలిపారు. అన్నదాన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వినుత కోటా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వీరమహిళలు గాయత్రి, శారద, నిర్మల, లక్ష్మి, రాజ్యలక్ష్మి, జనసైనికులు పాల్గొన్నారు.

కృత్రిమ కాలు కొరకు

ఫ్రీడం ట్రస్ట్ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి :ఎంపిడివో

విశాలాంధ్ర - చంద్రగిరి: కృత్రిమ కాలు అమరికకు ఫ్రీడమ్ ట్రస్ట్ నిర్వహిస్తున్న శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల అభివృద్ధి అధికారి వివి సూర్య సాయి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులకు కృత్రిమ కాలు అమర్చుటకు శనివారం తిరుపతి రాస్ భవనానందు కాలు కొలతలు తీసుకుని 20 రోజుల తరువాత రూ.51,000/- విలువ గల వెయిట్ లెస్ కృత్రిమ కాలు ఉచితంగా అమర్చబడుతుందని ఈ సదవకాశాన్ని అవసరమైన ప్రత్యేక ప్రతిభావంతులు సద్వినియోగం చేసుకోవాలని ఓ ఆయన కోరారు. అవసరమున్న వ్యక్తులు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, సదరు మెడికల్ సర్టిఫికెట్లు నకలు 2 కాపీలు, వికలత్వం కనిపించేవిధంగా రెండు పాస్ పోర్టు సైజు ఫోటోలు తీసుకుని వెళ్ళాలన్నారు.

అంగరంగ వైభవంగా

శ్రీ చెన్నమల్లయ్య తాత వార్షిక బ్రహ్మోత్సవాలు

విశాలాంధ్ర -సోమల : సోమల మండలం కరకమంద చెన్నమల్లయ్య తాత ఆలయ వార్షిక బ్రహ్మోత్సవ కార్యక్రమాలలో భాగంగా గురువారం పూజా కార్యక్రమాలు చెన్న మల్లయ్య తాతకు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలో వేదపండితులు సుబ్రమణ్యం శర్మ ఆధ్వర్యంలో గణపతిపూజ, గణపతి హోమం, నవగ్రహ పూజా, మూల మంత్ర జపాలు, హోమాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సోమల, కరకమంద, ఎస్ నడింపల్లి, సూరయ్య పల్లి తదితర గ్రామాల ప్రజలు పాల్గొని మొక్కుబడులు చెల్లించి తీర్థప్రసాదాలను

బురదగాలిలో విష జ్వరాలు

ప్రభుత్వ ఆసుపత్రులలో తూతూ మంత్రంగా వైద్య సేవలు -ప్రైవేటు ఆసుపత్రులకు పరుగులు

విశాలాంధ్ర - చిట్టమూరు: మండల పరిధిలోని బురదగాలి కొత్తపాలెం గ్రామంలో విష జ్వరాలు సోకి ప్రజలు కొత్తగుంట, మాల్లం,నాయుడుపేట ప్రాంతాలలోని ప్రైవేటు ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నట్లు బురదగాలి కొత్తపాలెం గ్రామస్తులు తెలిపారు.గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు గత 15 రోజుల నుండి కొత్తపాలెం గ్రామంలో విష జ్వరాలు సోకి మంచాన పడుతున్నారని ఒళ్ళు నొప్పులు, కాళ్లు,చేతులు తిమ్మిర్లు పట్టడం ఆహారం తినలేకపోవడం వంటి లక్షణాలతో బాధపడుతున్నామని అప్పులు చేసి ప్రైవేటు వైద్యశాలలకు వెళ్లి చూపించుకునే స్తోమతలేక కొంతమంది ప్రభుత్వ ఆసుపత్రిలో చూపించిన జ్వరాలు తగ్గుముఖం పట్టడం లేదని జిల్లా స్థాయి అధికారులు తమ గ్రామం వైపు కన్నెత్తి చూసి ఆదుకోవాలని బురదగాలి కొత్తపాలెం గ్రామస్తులు తెలిపారు.

మల్లం ప్రభుత్వ వైద్య అధికారిణి వివరణ:

మల్లం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ చందన ప్రియనీ వివరణ కోరగా గత ఐదు రోజుల నుండి తమ సిబ్బందితో కలిసి కొత్తపాలెం,బురదగాలి గ్రామాలలో మెడికల్ వైద్య శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని ఇక్కడ నీటి కొరత ఉండటం వలన ఇళ్ల వద్ద నీళ్ల తొట్లలో ప్లాస్టిక్ డమ్ములలో నీళ్లు నిలువ చేసుకొని ఆ నీటిని వారాలు తరబడి వాడడం వలన మరియు గత పదిరోజుల నుండి వాతావరణ కాలుష్యం తొలకరి జల్లులు పడడం వలన ఈ వైరల్ ఫీవర్ వ్యాపించిందని తాము ప్రతి ఇంటికి వెళ్లి ఇంటి వద్ద నిలువ ఉంచిన నీటిని తొలగించి కాచి చల్లార్చిన నీటిని తాగమని చెప్పినప్పటికీ ఇక్కడ గ్రామస్తులు కొంతమంది సరిగా సహకరించడం లేదని అంతేకాకుండా తాము వైద్యం అందిస్తున్న వారు వైద్యాధికారులు చెప్పిన విధంగా ఇచ్చినటువంటి మందులు వాడడం లేదని ఒకటి రెండు రోజుల్లో ఈ జ్వరాలు పూర్తిగా అదుపులోకి తెస్తామని డాక్టర్ చందన తెలిపారు.

జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలనా కార్యక్రమం

విశాలాంధ్ర -బైరెడ్డి పల్లి : లేప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్‌లో భాగంగా తీర్థం పిహెచ్‌సి గొల్లచీ మనపల్లి గ్రామంలో ఎంపీపీ స్కూల్ నందు ప్రధానో పాధ్యాయులు సుమిత్ర ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా హెచ్ఇ కాంతమ్మ మాట్లాడుతూ కుష్టు వ్యాధిపై అవగాహన కల్పిస్తూ వ్యాధి మైక్రో బ్యా క్టీరియం లేప్రై అనే బాక్టీరియా వలన వస్తుంది అని చర్మంపై స్పర్శ లేని మచ్చ ఉన్నట్లయితే అనుమానించి డాక్టర్ దగ్గర నిర్ధారణ చేయించు కోవాలని ,అలాగే వ్యక్తిగత శుభ్రత పాటించి పరిసరాల పరిశుభ్రత పాటించి జ్వరాలు రాకుండా జాగ్రత్తపడాలి అని వివరించారు. ఇందులో భాగంగా ఎంఎల్‌హెచ్‌పి ఆశ పాల్గొన్నారు.

జూలై 29 నుండి ఆగష్టు 7 వరకు గోవిందరాజస్వామివారి ఆలయంలో

ఆండాళ్ తిరువడిపురం ఉత్సవం

విశాలాంధ్ర - తిరుపతి : తిరుపతి శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో జూలై 29 నుండి ఆగష్టు 7వ తేదీ వరకు శ్రీ ఆండాళ్ అమ్మవారి తిరువడిపురం ఉత్సవం ఘనంగా జరుగనుంది. ఇందులో భాగంగా ఉత్సవ రోజుల్లో ఉదయం శ్రీ ఆండాళ్ అమ్మవారికి తిరుమంజనం, సాయంత్రం ఆస్థానం నిర్వహిస్తారు.ఆగష్టు 7న శ్రీ ఆండాళ్ అమ్మవారి శాత్తుమొర సందర్భంగా ఉదయం 9.30 నుండి 10.30 గంటల వరకు శ్రీ గోవిందరాజస్వామివారు, శ్రీ ఆండాళ్ అమ్మవారి ఉత్సవమూర్తులకు స్నపనతిరుమంజనం నిర్వహిస్తారు. సాయంత్రం 4 నుండి రాత్రి 8 గంటల వరకు శ్రీ గోవిందరాజ స్వామివారు, శ్రీ ఆండాళ్ అమ్మవారిని అలిపిరికి ఊరేగింపుగా తీసుకెళ్లి అక్కడ ఆస్థానం నిర్వహిస్తారు. ప్రత్యేకపూజల అనంతరం అలిపిరి నుండి రామనగర్ క్వార్టర్స్ లోని గీతామందిరం, ఆర్ఎస్ మాడ వీధి లోని శ్రీ విఖనసాచార్యుల ఆలయం, శ్రీ చిన్నజీయర్ మఠం మీదుగా ఊరేగింపు తిరిగి ఆలయానికి చేరుకుంటుంది. రాత్రి 8 గంటలకు శ్రీ ఆండాళ్ అమ్మవారి సన్నిధిలో శాత్తుమొర నిర్వహిస్తారు.

సప్తగిరి గ్రామీణ బ్యాంకులో

డిపాజిట్ మొబలైజేషన్‌పై సమావేశం

విశాలాంధ్ర - తిరుపతి రూరల్ : డిపాజిట్లు మొబలైజేషన్పై ఖాతాదారులు, ప్రజలతో కుప్పం బాదూరు సప్తగిరి గ్రామీణ బ్యాంక్ ఆవరణలో బుధవారం బ్యాంక్ మేనేజర్ రాములు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ బ్యాంకు సీనియర్ సిటిజన్స్ కు 8.60 శాతం, మామూలు వారికి 8.25శాతం వడ్డీ ఇస్తున్నట్లు చెప్పారు. ఈ క్రమంలోనే గురువారం ఒక్కరోజే ప్రజల నుంచి రూ.23.61 లక్షలను డిపాజిట్లుగా వచ్చిందన్నారు. రీజనల్ ఆఫీస్ నుంచి హాజరైన మేనేజర్ కె లక్ష్మీపతి మాట్లాడుతూ అప్పటి ఉమ్మడి చిత్తూరు కృష్ణ జిల్లాలోనూ 245 శాఖలలో కుప్పం బాదూరు శాఖ 1982లో 19వ శాఖగా ప్రారంభించినట్లు తెలిపారు. కుప్పం బాదూరు శాఖలో ఇప్పటివరకు అన్ని రకాల రుణాలు రూ.61 కోట్లు ఇవ్వడం జరిగిందని చెప్పారు. బ్యాంక్ అందిస్తున్న సేవలను ప్రజలు ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని బ్యాంక్ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పావని క్యాషియర్ సుజనారాణి సిబ్బంది ఖాతాదారులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

28న జూనియర్ సాఫ్ట్ టెన్నిస్ జట్ల ఎంపిక

విశాలాంధ్ర -తిరుపతి రూరల్ : తిరుపతి జిల్లా సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 28న జిల్లా జూనియర్ సాఫ్ట్ టెన్నిస్ జట్ల సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు ఆసంఘ తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి డి.సుధీర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించే ఈ సెలక్షన్స్‌లో ఎంపికైన జట్టు ఆగస్ట్ 4, 5 తేదీల్లో విజయవాడలో జరుగనున్న రాష్ట్రస్థాయి జూనియర్ సాఫ్ట్ టెన్నిస్ ఛాంపియన్షిప్, రాష్ట్ర జట్ల ఎంపికల్లో పాల్గొంటాయన్నారు. పోటీలో పాల్గొనే క్రీడాకారులు 2006 లో జన్మించిన వారు అర్హులన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు 28వ తేదీ ఉదయం 8 గంటలకు జన్మదిన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డ్ జిరాక్స్ కాపీతో పాటు నాలుగు పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలతో హాజరుకావాలని పేర్కొన్నారు. క్రీడాకారులు మరిన్ని వివరాల కోసం 9032270031 మొబైల్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థినికి నగదు బహుమతి

విశాలాంధ్ర-పిచ్చాటూరు: సత్యవేడు నియోజకవర్గం, పిచ్చాటూరు మండలం, వెంగళత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివి ఈ ఏడాది స్కూల్ టాపర్ గాను, అలాగే ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థిని బి.జోత్స్న కు బంగారుపాలెం రిటైర్డ్ ఎంఈఓ వరలక్ష్మి, ఆమె భర్త మునికృష్ణ రూ.10 వేలు నగదును బహుకరించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఎంఈఓ వరలక్ష్మి మాట్లాడుతూ చదువులో ప్రతిభ కనబరిచిన పేద విద్యార్థులను ప్రోత్సహించడంలో భాగంగా ఈ నగదు బహుమతిని అందించినట్లు తెలిపారు. ప్రతి ఏటా వెంగళత్తూరు జడ్పీ హైస్కూల్లో చదువులో ప్రతిభ కనబరిచే విద్యార్థులకు ఇలాంటి బహుమతులు అందజేస్తామన్నారు. తమ మండలంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థి ప్రతిభను గుర్తించి నగదు బహుమతిని అందించిన దాత వరలక్ష్మి దంపతులకు పిచ్చాటూరు ఎంఈఓ యుగంధర్ రాజు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

తల నీలాల ద్వారా 1.25 లక్షల ఆదాయం

విశాలాంధ్ర - కార్వేటినగరం : కార్వేటి నగరం గ్రామం స్కంద పుష్కరిణి సమీపము వద్ద కుమార గిరిపై వెలసిన శ్రీ సుబ్రహ్మణ్యం స్వామి దేవస్థానమునకు సంబంధించి ఆడికృతిక మహోత్సవం సందర్భంగా స్వామివారికి సమర్పించు తలనీలాలు వేలం ప్రకటన గురువారం స్కంద పుష్కరణ వద్ద దేవాదాయ శాఖ ఆలయ ఈవో ఎం కృష్ణ నాయక్ ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించారు. వేలంపాట్లో తమిళనాడుకు చెందిన వ్యక్తి లక్ష 25 వేల రూపాయలకు పాటను దక్కించుకున్నారు. ఈ వేలంపేట కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు రవి యాదవ్, టిడిపి నాయకులు వాసుదేవ రెడ్డి, మాది ఎంపిటిసి పురుషోత్తమ రాజు, హరి, కుమార్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం ధ్వంసం

విశాలాంధ్ర-చిత్తూరు: పలుకేసుల్లో పట్టుబడిన మద్యాన్ని గురువారం చిత్తూరు సబ్ డివిజన్ పోలీసులు ధ్వంసం చేశారు .చిత్తూరు వెస్ట్ సర్కిల్ పరిధిలోని యాదమరి 40 కేసులు, తవనంపల్లె 8 కేసులు గుడిపాల 68 కేసులు మొత్తం 116 కేసులలో పట్టుబడిన సీజ్ చేసిన 3240 లీటర్ల అక్రమ మద్యం 1258 లీటర్ల నాటు సారను ధ్వంసం చేశారు. యాదమరి పోలీస్ స్టేషన్ పరిధిలోని పెరుమాల పల్లి వద్ద కాళీ ప్రదేశంలో రోడ్డు రోలర్ ద్వారా ఈ అక్రమ మద్యాన్ని ధ్వంసం చేశారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు వెస్ట్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రవిశంకర్ రెడ్డి, ఎస్ ఈ బి ఏ ఎస్ రవి, యాదమరి ఎస్.ఐ రామాంజనేయులు, తవణంపల్లి ఎస్.ఐ అనిల్ కుమార్, గుడిపాల ఎస్.ఐ. నరేంద్ర కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా ఉపయోగకర వస్తువులు పంపిణీ

విశాలాంధ్ర-చిత్తూరు: తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు గువ్వల రమేష్ రెడ్డి (చిట్టి) పలు పాఠశాలల్లో విద్య ఉపయోగాలు వస్తువులను విద్యార్థులకు పంపిణీ చేశారు మండలంలోని గడ్డం వారి పల్లి పంచాయతీ తెల్ల నీళ్లపల్లి కి చెందిన నేస్తం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గువ్వల కేశవరెడ్డి సహకారంతో పరికిదొన క్లస్టర్ లోని ఎనిమిది పాఠశాలల విద్యార్థులకు గువ్వల రమేష్ రెడ్డి వాత పుస్తకాలతోపాటు విద్యా ఉపయోగకర వస్తువులను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కేశవరెడ్డి ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు నేస్తం ఫౌండేషన్ సభ్యులు తెల్ల నీళ్ల పల్లి గ్రామస్తులు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఎస్వి వైద్య కళాశాల వ్యవస్థాపక దినోత్సవం

విశాలాంధ్ర-తిరుపతి: ఎస్.వి వైద్య కళాశాలలో 64వ వ్యవస్థాపక దినోత్సవం (ఫౌండేషన్ డే) ను నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ ఎస్.వి వైద్య కళాశాల అదనపు వైద్య విద్య సంచాలకులు మరియు ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖరన్, మాట్లాడుతూ ఈ కళాశాలలో చదువుకున్న ప్రతి వైద్య విద్యార్థి దేశ విదేశాల్లో గొప్ప వైద్య సేవలు అందిస్తూ, ఈ కళాశాలకు ఎంతో వన్నె తెచ్చి పెట్టారని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ డే ప్రోగ్రాం ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ శశికాంత్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ వైద్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, పంపించిన సందేశాన్ని చదివి అందరికీ వినిపించారు. అందులో ముఖ్యంగా వైద్యానికి, వైద్య విద్యకు ఎనలేని సేవలు అందిస్తున్న వైద్యులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపి, భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ,మరియు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు, వైద్యానికి, వైద్య విద్యకు, వైద్య పరిశోధనలకు, పెద్దపీట వేస్తున్నట్టు, ఈ సందర్భంగా వైద్య శాఖ మంత్రి పంపిన సందేశాన్ని చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో1964 బ్యాచ్‌కి సంబంధించిన వైద్యాధికారులు డాక్టర్ ప్రేమానంద, ధూమపానం, శ్వాసకోస వ్యాధుల్లో వస్తున్న ఇబ్బందులు గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ తో వైద్యులకు, వైద్య విద్యార్థులకు, వైద్య సిబ్బందికి క్లుప్తంగా వివరించారు. వైద్య కళాశాలలో ఆనాడు చదువుకున్న జ్ఞాపకాలను అందరితో పంచుకున్నారు. ప్రతి వైద్య విద్యార్థి రోగులకు మెరుగైన వైద్యం అందించినప్పుడే గొప్ప వైద్యులుగా ఎదగగలమని ఈ సందర్భంగా ఆయన అన్నారు. తర్వాత వైద్య కళాశాల ప్రాంగణంలో వైద్యుల కొరకు ఫ్యాకల్టీ క్లబ్ ను పునర్నిర్మానించడం, ప్రారంభించడంజరిగినది. వైద్య కళాశాల ప్రాంగణంలో వివిధ రకాలైన చెట్లను నాటడం జరిగింది. ఇంత పచ్చటి వాతావరణంలో వైద్య విద్యను అభ్యసించడం మాకు ఎంతో ఆనందంగా ఉందని వైద్య విద్యార్థులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రుయా ఆసుపత్రి ఇంచార్జ్ సూపర్డెంట్ డాక్టర్ రాధా, ఎస్వీ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వెంకట్, డాక్టర్ డి.ఎస్ మూర్తి, ప్రసూతి వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ పార్థసారధి రెడ్డి, డాక్టర్ శీనయ్య, డాక్టర్ గోపీకృష్ణ, డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ చలపతి రెడ్డి, డాక్టర్ హరిబాబు, డాక్టర్ శ్రీనివాస్ యాదవ్, డాక్టర్ పాహీం, ఏపీ ఎన్జీవోస్ పట్టణ అధ్యక్షులు సురేష్ బాబు, ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఏటుకూరి గిరి బాబు, జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్, వైద్యులు వైద్య విద్యార్థులు, వైద్య సిబ్బంది, మరియు ఎస్వి వైద్య కళాశాల పిఆర్ఓ వీర కిరణ్ పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కోర్సులో ప్రవేశానికి 31న స్పాట్ అడ్మిషన్లు

విశాలాంధ్ర-సత్యవేడు: సత్యవేడు ప్రభుత్వ పాలిటెక్నిక్ కోర్సుల ప్రవేశానికి జూలై 31వ తేదీన స్పాట్ అడ్మిషన్లకు సంబంధించి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు స్థానిక పాలిటెక్నికల్ ప్రిన్సిపాల్ ఉషా దేవి పేర్కొన్నారు. గురువారం ఆమె మీడియాతో మాట్లాడుతూ సాంకేతిక విద్యాశాఖ అధికారుల ఆదేశాలు మేరకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామన్నారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఇందుకు అర్హులు అన్నారు. పాలిసెట్ ప్రవేశ పరీక్ష రాకపోయిన స్పాట్ అడ్మిషన్ల కోసం ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చును అన్నారు. ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల ప్రాంగణంలో జూలై 31వ తేదీన ఉదయం 9-30 గంటలకు ఇంటర్వ్యూ ప్రారంభమ వుతుంది అన్నారు.స్పాట్ అడ్మిషన్ల కోసం వచ్చే విద్యార్థులు పదవ తరగతి మార్కులు లిస్టు, టిసి, నాలుగవ తరగతి నుంచి 10 వరకు స్టడీ సర్టిఫికెట్, కులధ్రువీకరణ పత్రం, 6పాస్ ఫోటో ఫోటోలు, ఆధార్ కార్డు ఒరిజినల్తో పాటు మూడు సెట్లు జిరాక్స్ కాపీలు కూడా విద్యార్థులు వెంట తెచ్చుకోవాలి అన్నారు. స్పాట్ అడ్మిషన్ కోసం విద్యార్థులు ఫీజు దాదాపు 6,500 రూపాయలను చెల్లించాల్సి ఉందన్నారు. ఈ సదవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

సనాతన ధర్మ పరిరక్షణకు సహకరించండి

సీఎం బాబును కోరిన ఎస్ కె ఆర్

విశాలాంధ్ర-చిత్తూరు: సనాతన ధర్మ పరిరక్షణకు తనకు సహకరించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును బోయకొండ ఆలయ మాజీ చైర్మన్ పురాతన దేవాలయాల పునర్నిర్మాణదాత సనాతన ధర్మ పరిరక్షణ అవార్డు గ్రహీత ఎస్.కె వెంకటరమణారెడ్డి కోరినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నివాసంలో ఎస్‌కేఆర్ కలిశారు. పుంగనూరు నియోజకవర్గంలో ఇప్పటివరకు తాను చేసిన చేపట్టబోతున్న ఆలయాల నిర్మాణాలు పేద బలహీన వర్గాలకు నిర్వహించిన సామూహిక వివాహాలు వంటి వాటిని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఎస్‌కేఆర్ వివరించినట్లు తెలిపారు. ప్రముఖ శక్తి క్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయం ఆగస్తీశ్వర ఆలయాలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దే సంకల్పం ఉందనీ అంతేకాకుండా పురాతన దేవాలయాలను పునర్నిర్మించి సాంప్రదాయ చిహ్నాలుగా ఉన్న ఆలయాల పునరుద్ధరణకు కృషి చేస్తానని తెలిపినట్లు వివరించారు. పుంగనూరు చౌడేపల్లి ప్రాంతాల్లో తాను ఆలయాలు నిర్మిస్తుండగా తనపై పెట్టిన కేసుల వివరాలు కష్ట నష్టాలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లినట్లు ఎస్కేఆర్ తెలిపారు దీంతో ఆలయాల పునరుద్ధరణకు పర్యాటక కేంద్రాల అభివృద్ధికి తన సంపూర్ణ మద్దతు ఉంటుందని సీఎం నారా చంద్రబాబు నాయుడు తనకు హామీ ఇస్తూ అభినందించారని ఎస్కే ఆర్ వివరించారు. ఆలయాల జీర్ణోదరణకు ఊపిరి ఉన్నంతవరకు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన అన్నారు.

మైనార్టీల సంక్షేమానికి బడ్జెట్‌లో కేటాయింపులపట్ల హర్షం

విశాలాంధ్ర - పుంగనూరు: పట్టణంలోని బిజెపి కార్యాలయంలో బిజెపి మైనార్టీ నాయకులు అయూబ్ ఖాన్ అధ్యక్షతన బిజెపి నాయకులు సమావేశం కావడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్సీ సెల్ బిజెపి నాయకులు నరసింహులు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ నేతలు పదేపదే బిజెపి పార్టీ మైనార్టీలకు వ్యతిరేకమని ప్రచారం చేయడం జరిగిందన్నారు. మొన్నటికి మొన్న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూడా వైసిపి నాయకులు ప్రచారం చేసి మైనార్టీల ఓట్లకు బిజెపికి గండి కొట్టడం జరిగిందన్నారు. దేశంలో ఏ సందర్భంలో కూడా భారతీయ జనతా పార్టీ మైనార్టీలకు వ్యతిరేకమని ఎక్కడా చెప్పలేదన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న మైనార్టీల సంక్షేమం కోసం 2023-24 సంవత్సరంలో సవరించిన 2 వేల 608 కోట్ల 93 లక్షల రూపాయలు కేటాయించడం జరిగిందని, అదేవిధంగా 2004-05 కేంద్ర బడ్జెట్లో మైనార్టీల సంక్షేమం కోసం మూడువేల 183 కోట్ల 24 లక్షల రూపాయలు కేటాయించడం జరిగిందన్నారు. ఇకనైనా వైయస్సార్ సిపి పార్టీ మైనార్టీలకు బిజెపి వ్యతిరేకమని ప్రచారం చేయడం మానాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మైనార్టీ సోదరులు ఇప్పటికైనా బిజెపి పార్టీని అర్థం చేసుకుని రాబోయే రోజుల్లో బిజెపి పార్టీకి మైనార్టీ సోదరులు అండగా నిలవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం కేటాయించిన బడ్జెట్ నిధులతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మైనార్టీల సంక్షేమం కోసం రాష్ట్ర బిజెపి పార్టీ కృషి చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు పాల్గొన్నారు.

హెచ్‌ఎం కక్షపూరిత ధోరణి.. ఉపాధ్యాయులు ఆందోళన

ఫిబ్రవరి నెల వేతన బిల్లులను పెండింగ్‌లో పెట్టిన వైనం

విశాలాంధ్ర-సత్యవేడు: సత్యవేడు మండలం దాసుకుప్పం జడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల పట్ల సంబంధిత ప్రధానోపాధ్యాయు రాలు జ్యోతి కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారు. 2024 ఫిబ్రవరి నెలకు గాను వేతన బిల్లులు పెట్టకపోవడంతో ఇంతవరకు తమ బ్యాంకు ఖాతాలో జమ కాలేదని ఉపాధ్యాయులు పలువురు ఆరోపిస్తున్నారు. దీనిపై ప్రధాన ఉపాధ్యాయురాలు జ్యోతిని ప్రశ్నించిన నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారన్నారు. ఫిబ్రవరి నెలకు సంబంధించి వేతనం అందకపోవడంతో ఉపాధ్యాయులు ఇబ్బం దులు పడే అవకాశం వచ్చింది. అయితే ప్రధానోపా ధ్యాయురాలు జ్యోతిపై పలు ఆరోపణలు రావడం తో సంబంధిత ఆర్జెడి శాఖ అధికారుల బృందం 2024 జనవరి 30 తేదీన క్షేత్రస్థాయిలో విచారణ జరిపి ఫిబ్రవరి 2వ తేదీన హెచ్‌ఎం జ్యోతిని సస్పెండ్ చేశారు. తదనంతరం ఏమైందో ఏమో కానీ సస్పెండ్ చేసిన వారానికి హెచ్‌ఎం జ్యోతి మళ్లీ పాఠశాల విధులకు హాజరయ్యారు. ఈ నేపథ్యంలో హెచ్‌ఎం జ్యోతిపై వచ్చిన ఆరోపణలపై 2024 ఏప్రిల్ 1వ తేదీన మరోసారి తిరుపతి డీఈవో కార్యాలయ అధికారుల బృందం విచారణ జరిపారు. ఈ క్రమంలో హెచ్‌ఎం జ్యోతిని ఏప్రిల్ 15వ తేదీన చిత్తూరు జిల్లా జీడీ నెల్లూరు తూగుండ్రం జడ్పీ ఉన్నత పాఠశాలకు బదిలీ చేశారు. జ్యోతి స్థానంలో ఉపాధ్యాయులు వడివేలు కు తాత్కాలిక బాధ్యతను అప్పగించారు. ఇదే సమయంలో మరో వారం రోజులు తిరగకుండానే బదిలీ ఉత్తర్వులను తాత్కాలిక నిలుపుదల చేసి మళ్లీ దాసుకుప్పం హెచ్‌ఎంగా జ్యోతిని కొనసాగిస్తూ విద్యాశాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు ఇవ్వడం జరిగింది.కాగా సస్పెండ్ అయి తిరిగి నియమితులు కాగానే హెచ్‌ఎం జ్యోతి ఉపాధ్యాయుల పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తూ పాఠశాల వాతావ రణం దెబ్బతినేలా చేస్తున్నట్టు సంబంధిత ఉపాధ్యా యులు చెంగల్రాయం, మూర్తి, దాము, వడివేలు, సునీత, రాజేశ్వరి తదితరులు ఆరోపించారు. పైగా ఉపాధ్యాయులతో హెచ్‌ఎం సఖ్యతతో ఉన్నట్టు రాతపూర్వకంగా ఇవ్వాలని, లేనిపక్షంలో సర్వీసు రిజిస్టర్ అప్డేషన్లో సంతకం చేసేది లేదంటూ హుకుం జారీ చేస్తున్నారు. దీంతోపాటు ఉపాధ్యా యులను సస్పెండ్ చేయిస్తానని, ఉద్యోగాలు సైతం ఊడగొట్టిస్తానని తెగేసి చెప్పడం పట్ల సంబంధిత ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో ఉపాధ్యాయులపై చాడీలు చెబుతూ పాఠశాల స్నేహపూర్వక వాతావ రణం కోల్పోయేలా వ్యవహరించడం వల్ల విద్యార్థు ల్లో క్రమశిక్షణ కూడా లోపిస్తోంది. ఇన్కమ్ టాక్స్ సంబంధించి నాలుగవ కోటర్కు టీడీఎస్ పూర్తి చేయకుండానే రిటర్న్ ఈ ఫీలింగ్ చేసుకోమని చెబుతున్నారు. దీనిపై హెచ్‌ఎం జ్యోతిని వివరణ కోరగ సమాధానం దాటవేశారు. ఇప్పటికైనా సంబంధిత విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి ఇష్ట రాజ్యంగా వ్యవహరిస్తూ ఉపాధ్యాయుల పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తున్న హెచ్‌ఎం జ్యోతిపై తగు విచారణ జరిపి తమకు అందాల్సిన ఫిబ్రవరి నెల వేతనం, ఇన్కమ్ టాక్స్ ఫిల్లింగ్ సకాలంలో పూర్తయ్యేలా చొరవ చూపడంతో పాటు పాఠశాల విధులు సక్రమంగా నిర్వర్తించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయుల బృందం విన్నవించారు.

మేల్చురులో ప్రభుత్వ భూమి కబ్జా.. పట్టించుకోని అధికారులు

విశాలాంధ్ర-బాలాయపల్లి: లక్షలు విలువ చేసే భూమి దురాక్రమ ణకు గురైనా అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరించడం ఏమిటని పలువురు పలు రకాల విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని మేల్చురు గ్రామంలోని సర్వేనంబరు 8 లో గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి 5 సెంట్లు భూమి పట్టా ఇవ్వగా ఐదు సెంట్లు తో పాటు మరో ఇరవై సెంట్లు ఆక్రమించి యదేచ్ఛగా అక్రమణలు చేపడుతుండడంతో గ్రామంలోని కొందరు గతంలో అధికారులకు ఫిర్యాదులు చేశారు. ఈ క్రమంలో వివాదాలు నెలకొని ఒకరు హత్యకు గురైన సంఘ్రా లు ఉన్నాయి. దీంతో నిర్మాణాలు నిలిపేసిన ఆక్రమణ దారులు గత రెండ్రోజులుగా నిర్మాణాలు చేపడుతున్నారు. ప్రభుత్వ స్థలం దురాక్రమణ చేసి నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై పలు రకాల విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి లక్షలు విలువ చేసే భూమి దురాక్రమణ కాకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయంపై తహసీల్దార్‌ను వివరణ కోరగా తాము విచారించి చర్యలు తీసుకుంటామన్నారు.

డ్రోన్ స్ప్రేయింగ్ రైతులకు లాభదాయకం

విశాలాంధ్ర- దొరవారిసత్రం: పంటలకు డ్రోన్ స్ప్రేయింగ్ ద్వారా రైతులకు అధిక లాభాలు ఉన్నాయని సూళ్లూరుపేట ఏడిఏ అనిత అన్నారు. గురువారం దొరవారిసత్రం మండల పరిధిలోని తల్లంపాడు గ్రామంలో వరి పంటకు చేస్తున్న డ్రోన్ స్ప్రేయింగ్ ఏడీఏ, అనిత, వ్యవసాయ అధికారులు జ్యోతిర్మయి, కవిత వీక్షించారు. అనంతరం ఏడిఏ అనిత మాట్లాడుతూ ప్రస్తుతం కూలీల కొరత, దీనికి తోడు తక్కువ సమయంలో పంటలకు మందులను పిచికారి చేయడానికి రైతులు ఇబ్బంది పడుతున్నారు. గత కొంతకాలం నుండి పలు రకాల ప్రయత్నాలు చేసి చివరికి గత ఏడాది రాష్ట్ర ప్రభుత్వం డ్రోన్ స్ప్రేయింగ్ లను ప్రవేశపెట్టింది. ఈ డ్రోన్ స్ప్రేయిన్ ను కోట మండలం గూడలి గ్రామానికి చెందిన చాముండేశ్వరి రెడ్డి ఈ డ్రోన్స్ స్ప్రేయిన్ పైలెట్ శిక్షణ తీసుకొని ప్రభుత్వం నుండి అనుమతి పొందాడు. ఈ పైలెట్ ద్వారా ఎవరికైతే పొలాల్లో పిచికారి చేసుకోవాలో వారు ఈ 9440423487 కు ఫోన్ చేస్తే ఎకరాకి 350 రూపాయలతో డ్రోన్ స్ప్రేయిన్ ద్వారా పంట పొలాల్లో పిచికారి చేస్తారన్నారు. ఈ పద్ధతి ద్వారా పంట పూర్తిగా పురుగు మందు పిచికారి అవుతుందని రైతులకు తెలియజేశారు.

టీడీపీ నేతకు పరామర్శ

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: తెలుగుదేశం పార్టీ మహిళా విభాగం శ్రీకాళహస్తి పట్టణ అధ్యక్షురాలు సుమతి భర్త రవీంద్ర నాయుడును గురువారం శాసనసభ్యులు బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి సతీమణి బొజ్జల రిషితారెడ్డి పరామర్శించారు. సుమతి భర్త రవీంద్రనాయుడు ఇటీవల గుండెపోటుకు గురయ్యారు. దీంతో అతనిని చెన్నై అపోలో ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. గుండెకు స్టంట్ అమర్చారు. చికిత్స అనంతరం ఆయన శ్రీకాళహస్తికి రావడంతో బొజ్జల రిషితారెడ్డి పరామర్శించి... రవీంద్రనాయుడు త్వరగా కోలుకోవాలని కోరుకున్నారు. ఈమె వెంట రావిళ్ల మునిరాజానాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

విశాలాంధ్ర-కార్వేటినగరం: డీ.ఎం.పురం ఉన్నత పాఠశాలలో గురువారం శిక్షా సప్తాహ్ కార్యక్రమం లో 4వరోజు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. హెచ్.ఎం కేశవులు అధ్యక్షతన విద్యాప్రాముఖ్యత, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, స్త్రీ సాధికారత అంశాలపై ప్రదర్శించిన నాటికలు ఆకట్టుకున్నాయి. రమ్య, లీన, మోక్ష విద్యార్థుల ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు తిరుమల రాజు, మాలతి శిక్షణలో విద్యార్థులు పలు ప్రదర్శనలు చేశారు. కార్యక్రమంలో సుబ్రమణ్యం రెడ్డి, వెంకటరమణయ్య,డిల్లి బాబు, చిన్నయ్య శెట్టి, రంజిత్ కుమార్, సరస్వతి, హరిత, విద్యార్థులు పాల్గొన్నారు.

వెండి అంబారీపై చెంగల్వరాయస్వామి పురవిహారం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో ఆడికృత్తిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీవల్లీ, దేవసేన సమేత చెంగల్వరాయ స్వామి గురువారం ఉదయం వెండి అంబారీపై పురవిహారం చేశారు. చతుర్మాడవీధుల్లో వెండి అంబారీపై పురవిహారం చేస్తున్న శ్రీవల్లీ, దేవసేన సమేత చెంగల్వరాయస్వామిని దర్శించుకోవడానికి భక్తులు బారులు తీరారు. స్వామి అమ్మవార్లకు కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. స్వామి అమ్మవార్ల పురవిహారం సందర్భంగా మాడ వీధులు హరోం... హర.... హరోం... హర నామస్మరణలతో మారుమోగాయి. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో ఎన్.ఆర్ కృష్ణారెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున్ ప్రసాద్, ఏఈవో లోకేష్ రెడ్డి, సూపరింటెండెంటు, సీఎస్వో నాగభూషణం యాదవ్, ఆలయ తనిఖీదారు హరిబాబుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నేడే అంగన్వాడి పోస్టులకు ఇంటర్వ్యూలు

విశాలాంధ్ర-పలమనేరు: పలమనేరు నియోజకవర్గం లోని మూడు మండలాలకు చెందిన ఐసిడిఎస్ అంగన్వాడి పోస్టులకు ఇంటర్వ్యూలు జరుగునని ఐసిడిఎస్ పలమనేర్ ప్రాజెక్ట్ సిడిపిఓ ఇందిరా ప్రియదర్శిని గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆమె తెలిపిన వివరాల మేరకు పలమనేర్ ప్రాజెక్టు పరిధిలో ఉన్న పలమనేరు, పెద్దపంజాణి, గంగవరం, మండలాల్లో ఖాళీగా ఉన్న రెండు అంగన్వాడి వర్కర్లు, ఒక మినీ వర్కర్, ఆరు అంగన్వాడి మినీ వర్కర్ల పోస్టులకు పలమనేర్ ఆర్డిఓ కార్యాలయము నందు ఇంటర్వ్యూలు జరుగునని తెలిపారు. దరఖాస్తు చేసిన ప్రతి ఒక్కరూ 26వ తేదీ శుక్రవారం ఉదయం 11 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఆర్డీవో కార్యాలయానికి హాజరుకావాలని కోరారు.

క్షేత్ర స్థాయిలో ఎంఆర్‌పిఎస్ సంస్థగతా నిర్మాణాన్ని పూర్తి చేయండి

ఎం.ఆర్.పి.ఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి దుడ్డు రామకృష్ణ మాదిగ

విశాలాంధ్ర- పీలేరు: అభినవ అంబేద్కర్ మహాజన నేత మాన్యశ్రీ మందకృష్ణ మాదిగ గారి ఆదేశాల మేరకు అన్నమయ్య జిల్లా ఎం.ఆర్.పి.ఎస్, ఎం ఎస్ పి మరియు అనుబంధ సంఘాల విస్తృత స్థాయి జిల్లా సమావేశం ఎం.ఎస్.పి పీలేరు నియోజకవర్గ ఇంచార్జ్ గండికోట వెంకటేష్ మాదిగ ఆధ్వర్యంలో పీలేరు టిటిడి కళ్యాణమండపం నందు గురువారం జరిగింది. ఈ సమావేశానికి ఎం ఆర్ పి ఎస్ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు వై రవీంద్ర మాదిగ అధ్యక్షత వహించగా ఎం.ఎస్.పి జాతీయ నాయకులు వెలగచర్ల శివయ్య మాదిగ, ఎం ఆర్ పి ఎస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధికార ప్రతినిధి దుడ్డు రామకృష్ణ మాదిగ, విశిష్ట అతిథులుగా దుమ్ము వెంకటేశ్వర్లు మాదిగ (చిన్నా) పాల్గొన్నారు. ఈ సందర్భంగావెలగచర్ల శివయ్య మాదిగ,దుడ్డు రామకృష్ణ మాదిగ లు సంయుక్తంగా మాట్లాడుతూ షెడ్యూల్డ్ కులాల వర్గీకరణ లక్ష్య సాధనకై మహాజన నేత మాన్యశ్రీ మందకృష్ణ మాదిగ గత 30 సంవత్సరాలు గా అలుపెరుగని పోరాటం చేస్తున్నారని 30 సంవత్సరాల సుధీర్ఘ పోరాట ఫలితాలు ను మాన్యశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వం లో అతి త్వరలోనే మాదిగ, మాదిగ ఉపాకులాల ప్రజలు పొందుతారని ఆశాభావం వ్యక్తం చేశారు..ఈ సందర్భంగా మాన్యశ్రీ మందకృష్ణ మాదిగ గారి ఆదేశాల మేరకు ఎం ఆర్ పి ఎస్ మరియు అనుబంధ సంఘాల క్షేత్ర స్థాయి నిర్మాణం వ్యవస్థగత నిర్మాణం చదువుకున్న యువత తో వెంటనే పూర్తి చేయాలని, అదేవిదంగా మాదిగ,మాదిగ ఉపాకులాల ఉనికిని, అస్థిత్వాన్ని, ఆత్మ గౌరవాన్ని అత్యున్నత శిఖరాలకు చేర్చిన మాన్యశ్రీ మందకృష్ణ మాదిగ గారి నాయకత్వం లో జెండా ఆవిష్కరణ లు అన్నమయ్య జిల్లా లోని ప్రతి మాదిగ పల్లెలో పండుగ వాతావరణం లో జరుపుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమం లో ఎం ఎస్ పి రాష్ట్ర నాయకులు మదనపల్లి పెంచలయ్య, ఎం ఆర్ పి ఎస్ అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు,ముల్లంగి గురవయ్య, దొడ్డి సురేష్, ముదివేడు శ్రీనివాసులు, ముస్తూరి విశ్వనాథ, నాగేశ్వరరావు, గంగాధర, కొండప్ప సార్, హుస్సేనయ్య ,హరినాధ బాబు, చరణ్, నరసింహులు, గండికోట రెడ్డి కుమార్, రాజేష్, వంశి, రాజశేఖర్, రమణ, శివయ్య, సుబ్బయ్య, రవి, నరసింహులు, బాలాజీ.శివ, సుబ్బయ్య, సి వి రమణ, తిరుపతయ్య, సురేష్ బాబు, రామచంద్ర, సీన, శ్రీరాములు, మేస్త్రి రమణ, పట్టుగూళ్ల రమణ, నరసింహులు, వెంకటప్ప, చిత్తూరు ఎం ఈ ఎఫ్ నాయకులు రమేష్,అన్నమయ్య జిల్లా లోని 6 నియోజక వర్గాల్లోని ఎం ఆర్ పి ఎస్, ఎం ఎస్ పి మరియు అనుబంధ సంఘాల నియోజకవర్గం ఇంచార్జ్ లు, మండల ఇంచార్జ్ లు, నాయకులు పాల్గొన్నారు.

మిట్స్‌లో కృత్రిమ మేధస్సు పాత్రపై వరవర్క్‌షాప్

విశాలాంధ్ర-మదనపల్లె: అంగళ్లు సమీపం లోని మదనపల్లె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్స్ మరియు కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ వారు సంయుక్తముగా మొబిలిటీ మరియు స్మార్ట్ సిటీలలో కృత్రిమ మేధస్సు పాత్రపై వర్క్‌షాప్ ను కళాశాల లోని సివిల్ ఇంజనీరింగ్ వారు మూడు రోజుల పాటు కలశాల లోని మరియు ఇతర కళాశాల కు చెందిన విద్యార్థులకు మరియు అధ్యాపకులకు వర్క్‌షాప్ ను నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. యువరాజ్ అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా డాక్టర్ కె.వి.ఆర్ రవిశంకర్, సివిల్ ప్రొఫసర్, నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, వరంగల్ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ స్మార్ట్ సిటీలలో మొబిలిటీ అనేది ప్రపంచవ్యాప్తంగా పట్టణ ప్రకృతి దృశ్యాలను పునర్నిర్మించే కీలకమైన అంశం అని, వేగవంతమైన పట్టణీకరణతో వచ్చే ట్రాఫిక్ రద్దీ, కాలుష్యం మరియు అసమర్థరవాణా వ్యవస్థలకు సంబంధించిన సవాళ్లను ఎదుర్కొంటున్నాయి అని అన్నారు. స్మార్ట్ మొబిలిటీ సొల్యూషన్లు ఈ సమస్యలను పరిష్కరించడానికి సాంకేతికత మరియు డేటాను ప్రభావితం చేస్తాయని, స్థిరమైన, సమర్థవంతమైన మరియు సమానమైన రవాణా నెట్వర్కులను ప్రోత్సహిస్తాయన్నారు.ఈ కార్యక్రమం లో విభాగాధిపతి డాక్టర్ దీపాంకర్ రాయ్, కో ఆర్డినేటర్స్ డాక్టర్ సుదీర్ కుమార్ మరియు అనిత పాల్గొన్నారు.

ప్రజలను మభ్యపెట్టేవిధంగా కేంద్ర బడ్జెట్

విశాలాంధ్ర-తిరుపతి : టిడిపి కీలక మద్దతు కలిగిన బిజెపి నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి గతంలో కంటే భారీగా కేటాయిం పులు ఉంటాయని ఆశించిన రాష్ట్ర ప్రజలకు ఆశాభంగమే కలిగింది. కేంద్ర బడ్జెట్ లో ఆంధ్రప్రదేశ్ కు కేటాయించినట్లుగా చెప్పబడుతున్నవన్నీ ప్రజలను మోసపూరితంగా మభ్యపెట్టేవే. రాష్ట్ర విభజన జరిగి 10 సంవత్సరాల దీర్ఘ కాలం అయినా, ఇప్పటికి కూడా 'ఆంధ్రప్రదేశ్ విభజన చట్టాన్ని అమలుకు కట్టుబడి ఉన్నామ'ని బిజెపి కేంద్ర ప్రభుత్వం ప్రస్తుత బడ్జెట్ లో ప్రకటించి రాష్ట్ర ప్రజలు వంచిస్తున్నారంటే దానికి ప్రధాన కారణం కేంద్ర బిజెపితో బాటు, రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీలుగా టిడిపి, వైసిపి పార్టీల సంకుచిత అవకాశవాద, అసమర్థ విధానాలే. ఈ బడ్జెట్ లో రాజధాని అమరావతికి రూ 15,000 కోట్లు వివిధ ఏజెన్సీల ద్వారా ఋణంగా ఏర్పాటు చేస్తున్నదే కానీ సహాయము కాదు. ముఖ్యమైన 'పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయడం తమదే బాధ్యత' అని చెప్పారే కానీ నిధుల కేటాయింపు, నిర్వాసితులకు సహాయ, పునరావాసాల గురించి నిర్దిష్టమైన ప్రకటన లేదు. రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి సంబంధించిన విషయం కూడా ఇదే తీరులో ఉంది. రైల్వేజోన్, కడప ఉక్కు కర్మాగారం, పెట్రో కెమికల్ కాంప్లెక్స్ తదితర అంశాల అసలు ప్రస్తావనే లేదు.

కాబట్టి రాష్ట్రానికి కేటాయింపుల గురించి కేంద్ర బడ్జెట్ ఎక్కువ ప్రచారమే కానీ అసలు సారం ఏమీ లేదు. ఇలాంటి సమయంలో, విభజన హామీలు సాధించడానికి వామపక్ష, ప్రజాతంత్ర ఉద్యమ శక్తులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తేవాల్సిన అవసరం ఉంది.

వైభవంగా ధ్వజారోహణం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వర ఆలయానికి అనుబంధంగా శ్రీకాళహస్తి పట్టణంలోని విజ్ఞానగిరిపై వెలసిన శ్రీవల్లీ, దేవసేన సమేత చెంగల్వరాయస్వామి ఆలయంలో గురువారం ధ్వజారోహణ కార్యక్రమం వైభవంగా జరిగింది. ధ్వజారోహణం పురస్కరించుకుని స్వామి అమ్మవా ర్లను విశేషంగా అలంకరించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య ధ్వజారోహణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో ఎన్ఆర్ కృష్ణారెడ్డి, వేదపండితులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు పీకేస్తాం.. ఆసుపత్రికి తాళం వేస్తాం

టిడీపీ నేతల బెదిరింపులు.. వైద్యాధికారి కన్నీరు

విశాలాంధ్ర -బాలాయపల్లి : మేము చెప్పినట్టు చేయకపోతే ఉద్యోగాలు పీకేస్తాం మీరు ఉద్యోగాలు ఎలా చేస్తారో చూస్తాం అంటూ మండలం లోని సుబ్రమణ్యం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు వైద్యాధికారి పై ఆగ్రహించిన సంఘటన గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు మండలంలోని సుబ్రమణ్యం గ్రామానికి చెందిన ఆశా కార్యకర్త కృష్ణవేణి ని తొలగించాలని టీడీపీ నేతలు డియంహెచ్ వో కు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో క ష్ణ వేణి పనితీరుపై విచారించి నివేదికలు పంపాలని ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చినా నివేదికలు పంపలేదంటూ టీడీపీ నాయకుడు తో పాటు మరి కొందరు ఆరోగ్య కేంద్రానికి గురువారం మధ్యాహ్నం వెళ్లారు.హర్డ్ కాపీ ఇంకా ఎందుకు పంపలేదంటూ వైద్యాధికారి పై వివాదానికి దిగి ఉద్యోగాలు ఎలా చేస్తారో చూస్తాం. ఉద్యోగాలు పీకేస్తాం. ఆరోగ్యకేంద్రానికి తాళాలు వేస్తాం ఏం చేస్తారు అంటూ బెదిరింపులు దిగడంతో భయ భ్రాంతులకు గురైన వైద్యాధికారి స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇద్దరు కానిస్టేబుళ్ల సమక్షంలో వైద్యాధికారి, సిబ్బందిపై వివాదానికి కాల దువ్వడంతో వైద్యాధికారి రోజువారి జరిగే కార్యక్రమాల వల్ల నివేదికలు పంపడం ఆలస్యమైందని చెబుతున్నా పట్టించుకోకుండా అసభ్య పదజాలంతో తిట్టడంతో వైద్యాధికారి కన్నీరుమున్నీరయ్యారు. ఉన్నతాధికారులు స్పందించి క్షేత్ర స్థాయిలో అధికారులపై నాయకుల ఒత్తిళ్లనుండి కాపాడాలని సిబ్బంది కోరుతున్నారు.

ఘనంగా డాక్టర్ పి.సి రాయులు జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-తిరుపతి: కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పి.సి.రాయులు జన్మదిన వేడుకలు గాంధీ రోడ్డు లోని వారి కార్యాలయంలో గురువారం అత్యంత ఘనంగా జరిగినది. ఈ కార్యక్రమమునకు ముఖ్యఅతిధిగా బి.జె.పి రాష్ట్ర నాయకులు జి.భాను ప్రకాష్ రెడ్డి హాజరయ్యారు. మొదటిగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టి అనంతరం 750 మంది పేద ప్రజలకు అన్నదానము చేసారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పి.సీ. రాయులు మాట్లాడుతూ గత 20 సంవత్సరములుగా కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించామని విద్యార్థులకు, మహిళలకు, కాలేజీ పిల్లలకు, పాఠశాల పిల్లలకు ముఖ్యంగా పేద బడుగు బలహీన వర్గాల వారికి అనేక రకాలుగా సహాయం అందించామని, కోవిడ్ సమయంలో అనేకమంది పేద వర్గాల వారికి వివిధ రాష్ట్రాలలో నుండి సొంత ఊర్లకు వెళ్లే సందర్భంలో వారికి ఆపన్న హస్తం అందించామని తెలియజేస్తూ ఉమ్మడి జిల్లా, రాయలసీమ జిల్లాల్లో అనేక ప్రాంతాలలో కార్యక్రమాలు నిర్వహించి పేద ప్రజానీకానికి సహాయ సహకారాలు అందించామని తెలియజేశారు. భవిష్యత్తులో ట్రస్ట్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలియజేశారు. భాను ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ ఎంతోమంది మన ప్రాంతంలో ఉన్నప్పటికీ పి.సి.రాయులు వంటి గొప్ప సేవాభావము కలిగిన వ్యక్తి తిరుపతిలో ఉండడము మన అదృష్టం అని 20 సంవత్సరములుగా పి.సి.రాయులు మంచి మనసుతో ఎన్నో సేవా కార్యక్రమాలు చేసి తద్వారా పేద ప్రజలకు అలాగే కళలను పోషిస్తూ కళాకారులకు తోడ్పాటును అందించారని తిరుపతిలోని అనేక సంస్థలకు సహాయ సహకారాలు అందిస్తూ చేస్తున్న వారి సేవ గుణానికి ధన్యవాదములు తెలియజేశారు. అనంతరం జన్మదినోత్సవ సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం నిత్యాన్న దాన ట్రస్టుకు పది లక్షల రూపాయలు విరాళంగా ఇవ్వడం జరిగింది. అక్కడనుండి బైరాగి పట్టెడలో ఉన్న జాస్మిన్ వృద్ధాశ్రమం వృద్ధులకు స్థానిక పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో బండి మధుసూదన్ రెడ్డి, ఉదయగిరి కృష్ణమూర్తి, ఉమాపతి, షాబుద్దీన్, సుబ్రహ్మణ్యం రెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అర్జీలను త్వరగా పరిష్కరించాలి: డిఆర్ఓ

విశాలాంధ్ర – చిత్తూరు : అర్జీల పరిష్కారంలో క్షేత్ర స్థాయిలో పరిశీలించిన అనంతరం చర్యలు చేపట్టాలని డిఆర్ఓ బి. పుల్లయ్య పేర్కొన్నారు. గురువారం స్థానిక జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరము నందు రాష్ట్ర ముఖ్య మంత్రినారా చంద్రబాబు నాయుడు కుప్పం పర్యటనలో భాగంగా నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీల పరిష్కారంపై వివిధ శాఖల వారిగా తీసుకున్న చర్యలను డిఆర్ఓ, డ్వామా పిడి ఎన్.రాజశేఖర్ తో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా డి ఆర్ ఓ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి కుప్పం పర్యటనలో భాగంగా అందిన అర్జీల పరిష్కారంపై సమీక్షించడం జరుగు తున్నదని ఎక్కువగా అర్జీలు అందిన రెవెన్యూ, పిఆర్, డిఆర్డిఏ, విద్యా, పోలీసు, సంబంధిత శాఖల అధికారులు బృందాలను ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. అర్జీదారుల సమక్షంలో సమస్య పరిష్కారం కొరకు క్షేత్ర స్థాయిలో పర్యటించి పరిష్కరించాలని, అర్థవంతంగా అర్జీ దారునికి ఎండార్స్మెంట్ ఇవ్వాలని, ఆర్థికపరమైన అంశాల విషయంలో ఉన్నతాధికారులకు పంపాలన్నారు. అర్జీలకు సంబంధించి తీసుకున్న చర్యలను 12 కాలమ్స్ తో కూడిన నివేదికను ప్రతి శాఖ వారు కలెక్టరేట్ కు అందిస్తూ ప్రతి అర్జీదారునికి ఇచ్చిన ఎండార్స్మెంట్ కాపీని కూడా జత చేయాలన్నారు. ఈ సమావేశంలో ఏ ఎస్ పి ఆరిఫుల్లా, జడ్పీ సీఈఓ గ్లోరియా పి ఆర్, ఆర్అండ్‌బి ఎస్ఈలు చంద్రశేఖర్ రెడ్డి ఉమామహేశ్వర్ రెడ్డి, డిఎంహెచ్ఓ డా .ప్రభావతీ దేవి, డిఎల్‌డిఓ రవి కుమార్ ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధమవుతున్న అన్నా క్యాంటీన్

విశాలాంధ్ర– సూళ్లూరుపేట : తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలోని గణపతి నగర్ (గాండ్ల వీధి చివరలో) రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు నెలలో ప్రారంభించనున్న అన్న క్యాంటీన్ రూపురేఖలు దిద్దుకుంటూ ఉంది. గతంలో అదే స్థలములో అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేసి ఉన్నారు. ప్రభుత్వం మారిన తర్వాత ఆ స్థలంలో అర్బన్ హెల్త్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఇప్పుడు అన్న క్యాంటీన్ ఏర్పాటు చేసేందుకు ఆ అర్బన్ హెల్త్ సెంటర్ని అక్కడ నుంచి సాయి నగర్‌కు మార్చడమైనది. పేదలకు ఆకలి తీర్చాలి అనే ఆలోచనతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ అన్న క్యాంటీన్‌లను రాష్ట్రం మొత్తం ప్రారంభించనున్నారు. అన్నా క్యాంటీన్‌తో పాటు ఎంతోమంది నిరుపేదలకు ఆకలి తీర్చిన డొక్కా సీతమ్మ క్యాంటీన్‌ను కూడా ప్రారంభిస్తున్నారు. అన్నా క్యాంటీన్ ప్రారంభిస్తున్నందుకు పేద ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అభ్యుదయానికి చిరునామా

అడిగోపుల సాహిత్యం

అడిగోపుల వెంకటరత్నమ్ సంస్మరణ సభలో వక్తలు

అక్షరాలను ఆస్తులుగా తెలుగు సాహిత్యానికి అందించారు

చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న రచయితలు

విశాలాంధ్ర – తిరుపతి : గురువారం తిరుపతి నగరంలోని వేమన విజ్ఞాన కేంద్రం సమావేశ మందిరంలో తిరుపతి సాహితీ సంస్థలు అడిగోపుల వెంకట రత్నమ్ సంస్మరణ సభను నిర్వహించారు. మల్లారపు నాగార్జున సభకు అధ్యక్షత వహించారు.ప్రముఖ రచయిత రాసాని మాట్లాడుతూ వారు కవిత్వానికి నిలువెత్తు సంతకం అంటూ కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వరించదగిన రచయిత అడిగోపుల వెంకటరత్నమ్ అన్నారు.సీనియర్ పాత్రికేయులు కొత్వాలు అమరేంద్ర మాట్లాడుతూ అక్షరాలకు ఆయుస్సు పోసిన కవి అనీ యాభై ఏళ్ళ సాహితీ కృషి వలుదన్నారు.తిరుపతి జిల్లా రచయితల సంఘం కార్యదర్శి డాక్టర్ మన్నవ గంగాధర ప్రసాద్ మాట్లాడుతూ రాబోవు తరానికి ప్రేరణ అడిగో పుల కవిత్వం అన్నారు.తెలుగు భాషోద్యమ సమితి ప్రధాన కార్యదర్శి ఆకుల మల్లేశ్వర రావు మాట్లాడుతూ అడిగోపుల కవిత్వం రేపటి సమాజాన్ని ఆవిష్కరించిందని కొనియాడారు. గరికపాటి రమేష్ బాబు మాట్లాడుతూ అభ్యుదయ సాహిత్యానికి చెరిగిపోని సంతకం అడిగోపుల అని విశ్లేషించారు.వారి కుమారుడు శ్రీకాంత్ మాట్లాడుతూ వారి నాన్న జీవితాన్ని, సాహితీ జ్ఞాపకాలను విపులంగా పంచుకున్నారు.సమావేశంలో ఇంకా అరసం నేతలు సాకం నాగరాజ, యువశ్రీ మురళి, సాహితీ స్రవంతి కన్వీనర్ ఒ. రమణ, రచయితలు పేరూరు బాల సుబ్రమణ్యం తదితరులు అడిగోపులతో తమ జ్ఞాపకాలను పంచుకున్నారు.సమావేశంలో భూమన్, టెంకాయల దామోదరం, నెమిలేటి కిట్టన్న, డా. పొక్కళ్ళ సుభద్ర, మామిడికొమ్మ గురుస్వామి, ఆర్.సి.కె.రాజు, నడ్డి నారాయణ, అడిగోపుల వారి కుమారుడు శ్రీకాంత్ మరియు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

విధిగా హెల్మెట్లు వాడండి...

ప్రాణాలు కాపాడుకోండి.!

శ్రీకాళహస్తి డిఎస్పీ ఉమామహేశ్వర్ రెడ్డి

భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్లకార్డులతో అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర – శ్రీకాళహస్తి: ప్రతి ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్లు ధరించి, తమ విలువైన ప్రాణాలను కాపాడుకోవాలని శ్రీకాళహస్తి డిఎస్‌పి ఉమామహేశ్వర్ రెడ్డి కోరారు. భారత్ స్కౌట్స్ అండ్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో ఆర్ పి బి ఎస్ బాలుర ఉన్నత పాఠశాల, పాఠశాల నుండి అవగాహనా ర్యాలీని అయన ప్రారంభించారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల బాబుఅగ్రహారం, సరస్వతి బాయ్ పురపాలక ఉన్నత పాఠశాలకు చెందిన స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు ర్యాలీలో పాల్గొని, ప్లకార్డులు చేతపట్టి, ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్లు వాడాలని నినాదాలు చేస్తూ, అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డిఎస్‌పి ఉమామహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఆగస్టు ఒకటి నుండి తప్పనిసరిగా ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్లు ధరించాలని, లేకుండా పట్టుబడితే పోలీసులు చర్యలు తీసుకుంటారని అన్నారు. వాహనదారులు హెల్మెట్లను ధరించడం సామాజిక బాధ్యతగా గుర్తించుకోవాలని కోరారు. ఎంఈఓ భువనేశ్వరి మాట్లాడుతూ హెల్మెట్లపై ప్రజలకు అవగాహన కల్పించడం పట్ల భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ లను అభినందించారు. అందరూ హెల్మెట్లు విధిగా ధరించాలని, కొందరు నిర్లక్ష్యంగా హెల్మెట్లు లేకుండా వాహనాలు నడిపి ప్రాణాలు కోల్పోయి, వారి కుటుంబ సభ్యులు అనాధలుగా మార్చుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి, స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యాలయ కమీషనర్ టి. రమేష్ బాబు, సహాయ కమీషనర్ పార్వతి, యూత్ చైర్మన్ ఎస్ కె అజారుద్దీన్, స్కౌట్ మాస్టర్లు గోపాలకృష్ణ, వెంకటరమణ, యోగానందం, ధనుష్, సుబ్రహ్మణ్యం, గైడ్ కెప్టెన్ పద్మావతి, నిర్మల, సరిత పాల్గొన్నారు.

కాణిపాకం ఆలయానికి హుండీ ద్వారా 1.24 కోట్లు ఆదాయం

విశాలాంధ్ర –చిత్తూరు: కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయ హుండీల ద్వారా 1.24,41,336 రూపాయలు వచ్చినట్లు ఆలయ ఈవో వెంకటేష్ తెలిపారు. 17 రోజులకు 1,24,41,336 రూపాయలు వచ్చినట్లు పేర్కొన్నారు. గురువారం ఆలయంలో హుండీల లెక్కింపును చేపట్టినట్లు పేర్కొన్నారు. ఇందులో బంగారం 24 గ్రాములు, వెండి 440గ్రాములు ఉన్నట్లు తెలిపారు. అలాగే గోసంరక్షణ హుండీ ద్వారా 9,448 రూపాయలు, నిత్య అన్నదానం హుండీ ద్వారా 30,629 రూపాయలు వచ్చినట్టు ఈవో తెలిపారు.

టీటీడీ ఏఈఓ బాధ్యతలు స్వీకరించిన వెంకటయ్య చౌదరి

విశాలాంధ్ర – తిరుపతి : తిరుమల తిరుపతి దేవస్థానం అడిషనల్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్గా చిరుమామిళ్ల వెంకటయ్య చౌదరి సోమవారం బాధ్యతలు చేపట్టినట్లు గురువారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలిపింది. కస్టమ్స్ కమిషనర్ బాధ్యతల నుండి శుక్రవారం విజయవాడలో రిలీవ్ అయ్యారు. చౌదరి స్థానంలో ఇంచార్జ్ కస్టం కమిషనర్ గా సెంట్రల్ జీఎస్టి కమిషనర్ సాధు నరసింహారెడ్డిని కేంద్ర ప్రభుత్వం నియమించింది టీటీడీలో జాయింట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గా బాధ్యతలు కూడా వెంకయ్య చౌదరి నిర్వహిస్తారు. టీటీడీలో డిప్యూటేషన్‌పై చౌదరి జులై 22- 24 నుండి జులై 21- 27 వరకు మూడేళ్లపాటు పనిచేస్తారు. 2005 ఐఆర్ఎస్ అధికారైన చౌదరి స్వస్థలం పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గంలోని బెల్లంకొండ వారి పాలెం. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖలోని ఇన్ డైరెక్ట్ కేడర్లో విధులు నిర్వహించారు 2014 –19 మధ్య కాలంలో మైనింగ్ కార్పొరేషన్ ఎండిగా డిప్యుటేషన్‌పై ఏపీ ప్రభుత్వంలో పనిచేశారు. విధి నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం నుండి పలు అవార్డులు వెంకటయ్య చౌదరి దక్కించుకున్నారు.

కార్గిల్ విజయ్ దివస్ ర్యాలీని జయప్రదం చేయండి

మాజీ సైనిక సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు హరికృష్ణ రెడ్డి

విశాలాంధ్ర – చిత్తూరు: విశాలాంధ్ర – గంగాధర నెల్లూరు: కార్గిల్ అమరవీరులకు నివాళులర్పించుటకు కార్గిల్ విజయ్ దివస్ ర్యాలీని జయప్రదం చేయవలసిందిగా గంగాధర నెల్లూరు మండల మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షులు హరికృష్ణ రెడ్డి పిలుపునిచ్చారు. 26వ తేదీ శుక్రవారం జిల్లా కేంద్రంలోని అమర జవాన్ స్థూపం వద్ద 10 గంటలకు కార్గిల్ అమరవీరులకు నివాళు లర్పించి కార్గిల్ విజయ్ దివస్ ర్యాలీ నిర్వహిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమానికి చిత్తూరు జిల్లా కలెక్టర్, చిత్తూరు జిల్లా ఎస్పీ ముఖ్య అతిథులుగా హాజరవుతారని కావున మండలంలోని మాజీ సైనికులందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా కోరారు.

విశాలాంధ్ర అక్షరాక్షరం అభ్యుదయం

విలేకరులు కావలెను

విశాలాంధ్ర తెలుగు జాతీయ దినపత్రికలో చిత్తూరు, తిరుపతి జిల్లాలో దిగువ తెలిపిన మండలాల్లో పనిచేయుటకు స్థానికంగా ఉన్న అభ్యర్థులు కావలెను. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై, తెలుగుభాషపై పరిజ్ఞానం ఉండాలి.

పనిచేయవలసిన మండలాలు :

తిరుపతి సిటీ, వడమాలపేట, నగరి, నాగలాపురం, డక్కిలి, విరాల, రామచంద్రాపురం, సదుం, యాదమరి, వరదయ్యపాళెం బంగారుపాలెం, రొంపిచెర్ల, పూతలపట్టు, శాంతిపురం, గుడుపల్లె

గమనిక: ఆయా మండలాల్లో స్థానికులై ఉండాలి

సంప్రదించవలసిన నెంబరు: 9490952134